విలేఖరులు
కావలెను
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాధాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394
సంప్రదించగలరు ఎడిటర్ చల్లా శ్రీకాంత్


# రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM
RNI : APBIL/2023/86665

గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 222 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | బుధవారం 11 సెప్టెంబర్ 2024 | పేజీలు : 8 వెల :రూ 2-00
GUNTUR | VOL-01 | ISSUE - 222 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 11WEDNESDAY SEPTEMBER 2024 | PAGES : 8 | Rs :2-00


## బోట్లు వదిలిన వారిని వదిలిపెట్టం.. కఠినచర్యలు తీసుకుంటాం

విజయవాడ: వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పదో రోజు పర్యటించారు. బుడమేరు గండ్లు పూడ్చిన ప్రదేశాలకు కాలినడకన వెళ్లి పరిశీలించారు.గండ్లు పడిన తీరు, వరద ప్రవాహం గురించి అధికారులు సీఎంకు వివరించారు."గత ప్రభుత్వం బుడమేరు గట్లను పట్టించుకోలేదు. కృష్ణానదిలో 11.43 క్యూసెక్కుల వరద వచ్చింది. దీనికి తోడు డ్రెయిన్లు పొంగాయి. అన్నీ కలిసి ప్రజా జీవితాన్ని అతలాకుతలం చేశాయి. మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ అధికారులు రేయింబవళ్లు కష్టపడి బుడమేరుకు పడిన మూడు గండ్లను పూడ్చారు. డ్రోన్ లైవ్ ద్వారా గండ్ల పూడ్చివేత పనులు పర్యవేక్షించాం. గత ఐదేళ్లుగా బుడమేరు ఆక్రమణలకు గురైంది. దాదాపు 6లక్షల మంది జీవితాలు అతలాకుతలమయ్యాయి. దుర్మార్గమైన పాలనలో చేసిన తప్పుల వల్లే ఈ పరిస్థితి వచ్చింది. హెలికాప్టర్లు, డ్రోన్ల సాయంతో ఆహారం, తాగునీరు అందించాం. ఎంత ప్రయత్నించినా శివారు ప్రాంతాలకు సరిగా సాయం అందించలేకపోయాం. మూడ్రోజుల పాటు ఏం చేయాలో.. ఎలా చేయాలో అర్థం కాలేదు. ఐదేళ్లలో వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేశారు. వరద బాధితులకు సాయం చేసేందుకు అనేక మంది ముందుకొస్తున్నారు.కొందరు ఆర్థిక సాయం చేస్తుంటే.. మరికొందరు ఆహారం సాయం చేస్తున్నారు. కానీ, వైకాపా మాత్రం విషం చిమ్ముతోంది. ఓడిపోయారని ప్రజలపై కక్ష తీర్చుకోవాలనే విధంగా ప్రవర్తిస్తున్నారు. కృష్ణాలో 11.20లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నప్పుడు నదిలో మూడు బోట్లు వదిలిపెట్టారు. ఆ బోట్లు కౌంటర్ వెయిట్‌కు కాకుండా కాలమ్‌ను ఢీకొట్టి ఉంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేది. బోట్లకు వైకాపా రంగులు ఎందుకున్నాయి? బోట్లు వదిలిన వారిని వదిలిపెట్టం. కఠిన చర్యలు తీసుకుంటాం. వరద ప్రాంతాల్లో మంత్రులు, ఉన్నతాధికారులు, అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది కష్టపడి పనిచేశారు. ప్రాణ నష్టం బాగా తగ్గించగలిగాం. ఫైరింజన్ల సాయంతో ఇళ్లు శుభ్రం చేస్తున్నాం. వరదలపై యుద్ధం చేశాం.. గెలిచాం. యుద్ధంలో గెలిచాం.. దాని ప్రభావం మాత్రం ఇంకా వెంటాడుతోంది. పాడైన ఇళ్లు సామగ్రి వివరాలు 'సేకరిస్తున్నాం" అని సీఎం తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ కేశినేని చిన్ని, స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఇరిగేషన్ అధికారులు సీఎం పర్యటనలో ఉన్నారు.

**ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఎం చంద్రబాబు**

వరద ప్రభావిత ప్రాంతాల్లో 10వ రోజు అందుతున్న సహాయక చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, కాకినాడ, తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి..భారీ వర్షాలు, ప్రస్తుత పరిస్థితులను సీఎం అడిగి తెలుసుకున్నారు. వరద ముంపుపై ఎన్యుమరేషన్ బుధవారం సాయంత్రానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు సాయంత్రానికి విజయవాడ నగరంలో సాధారణ స్థితి నెలకొంటుందని, పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగాలని సూచించారు. నిత్యావసర సరకుల పంపిణీ



సాఫీగా జరుగుతోందని, నేటి సాయంత్రానికి సరుకుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొంటే ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించవచ్చని చంద్రబాబు అన్నారు.ఉత్తరాంధ్ర తుపాన్లు అధికంగా సంభవించే ప్రాంతమని, వాటిని ఎదుర్కొనేలా వ్యూహం సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. భారీ వర్ష సూచన ఉన్న ప్రాంతాలను ముందుగానే అప్రమత్తం చేయడంతో ప్రాణనష్టం తప్పిందని ఆయా జిల్లాల అధికారులు సీఎంకు వివరించారు. తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతామారామరాజు, కాకినాడలో ముందస్తు చర్యలతో పరిస్థితులు సాధారణంగానే ఉన్నాయని ఆయా జిల్లాల కలెక్టర్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాలు, వాగులు, వంకల పరిస్థితిపై అప్రమత్తంగా ఉండాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## విధుల్లో చేరని బెంగాల్ వైద్యులు.. సుప్రీం వద్దన్నా కొనసాగుతున్న నిరసనలు



కోల్‌కతా: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది.నిరసన చేస్తున్న వైద్యులు నేటి సాయంత్రంలోగా విధుల్లో చేరాలని సుప్రీం కోర్టు ఆదేశించినా.. ఇంకా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. బాధితురాలికి న్యాయం జరిగేంత వరకు విధుల్లో చేరే ప్రసక్తేలేదంటూ వైద్యులు చెబుతున్నారు.

**అప్పటివరకు నిరసనలు కొనసాగింపు..**

"మా డిమాండ్లు నెరవేరేంత వరకు ఈ నిరసనలు కొనసాగుతూనే ఉంటాయి. కోల్‌కతా పోలీస్ కమిషనర్, ఆరోగ్య కార్యదర్శి, హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్, వైద్య విద్య డైరెక్టర్‌లను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాము. బాధితురాలికి న్యాయం జరిగేంత వరకు ఈ ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయి" అని వైద్యులు తేల్చి చెప్పారు. కాగా.. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా హత్యాచార ఘటనపై ఇటీవల విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు .. పశ్చిమ బెంగాల్ ఆరోగ్య శాఖ సమర్పించిన నివేదికను పరిశీలించిన సంగతి తెలిసిందే.రాష్ట్రంలో వైద్యుల నిరసనలతో ఇప్పటివరకు 23 మంది ప్రాణాలు కోల్పోయారని అందులో తెలిపింది. మరోవైపు, కేసు దర్యాప్తుపై కొత్తగా మరో నివేదిక ఇవ్వాలని సీబీఐని న్యాయస్థానం ఆదేశించింది. అదే విధంగా వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా ఆందోళనలు చేస్తున్న వైద్యులు మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు విధుల్లోకి చేరాలని సోమవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. లేకపోతే కఠిన చర్యలు తప్పవని ధర్మాసనం హెచ్చరించింది. ఏ నిరసన అయినా, ఆందోళనలు అయినా.. విధులను విస్మరించి చేయడం సరికాదని.. తక్షణమే విధుల్లోకి చేరి రోగులకు సేవలందించాలని సూచించింది.మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు విధులకు హాజరైన వారిపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు ఉండవని.. నిరసనలు కొనసాగిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. న్యాయస్థానం విధించిన డెడ్‌లైన్ పూర్తి అయినా.. వైద్యులు మాత్రం ఇంకా నిరసనలు కొనసాగిస్తూనే ఉన్నారు. బాధితురాలికి న్యాయం జరిగేంత వరకు ఆందోళనలను కొనసాగిస్తామని వైద్యులు తేల్చి చెప్పారు.

## రాహుల్ వ్యాఖ్యలు తప్పుడు కథనాలే :భాజపా




న్యూఢిల్లీ : భారత్‌లో రాజకీయాల కంటే మత స్వేచ్ఛపైనే పోరాటం కొనసాగుతోందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగింది. ఈ సందర్భంగా ఓ వర్గాన్ని ప్రస్తావించడం ఇందుకు కారణమైంది.సున్నితమైన అంశాలపై మాట్లాడుతూ ప్రమాదకర వాతావరణాన్ని సృష్టించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని భాజపా మండిపడింది. విదేశాల్లో నివసిస్తున్న సిక్కు వర్గంలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది." రాహుల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. చరిత్రలో మా వర్గం ఒక్కసారైనా ఆందోళన, అభద్రత, అస్తిత్వ ముప్పు ఎదుర్కొన్నదంటే.. అది కేవలం గాంధీ కుటుంబం అధికారంలో ఉన్న సమయంలోనే. ఇళ్ల నుంచి అమాయకులను బయటకు తీసుకువచ్చి.. టైర్లు వేసి సజీవ దహనం చేశారు. నాటి దాడుల్లో 3 వేల మంది ప్రాణాలు కోల్పోయారు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**కోర్టు ముందు నిలబెడుతాం..**

భాజపా నేత ఆర్‌పీ సింగ్ మాట్లాడుతూ.. సిక్కుల గురించి రాహుల్ గాంధీ అమెరికాలో ఏం మాట్లాడారో వాటినే భారత్‌లో పునరావృతం చేయగలరా? అని సవాల్ విసిరారు. అలా చేస్తే ప్రతిపక్ష నేతపై కేసు వేసి కోర్టుకు లాగుతామని హెచ్చరించారు. మరో కేంద్ర మంత్రి శివ రాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. మాజీ ప్రధాని వాజ్‌పేయీ విపక్షంలో ఉన్నప్పుడు కూడా దేశ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం చేయలేదన్నారు.అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలో భారతీయ సంతతి ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీ.. కొన్ని వర్గాలు, భాషలు, మతాలను ఆర్‌ఎస్‌ఎస్ అభద్రతా భావానికి గురిచేస్తోందని ఆరోపించారు. ఇలా భారత్‌లో మత స్వేచ్ఛపైనే పోరాటం జరుగుతోందని, రాజకీయాల గురించి కాదన్నారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ చేసిన ఉదాహరణలు తాజా దుమారానికి కారణమయ్యాయి.

## మోడీ సాయం తెస్తారా ? ఎన్డీయే నుంచి తప్పుకుంటారా ? చంద్రబాబుకు షర్మిల డిమాండ్...!

అమరావతి: విజయవాడ వరద బాధితులకు కేంద్రం నుంచి సాయం తెస్తారా లేక ఎన్డీయే నుంచి తప్పుకుంటారా అని సీఎం చంద్రబాబును పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల ప్రశ్నించారు. విజయవాడ పాత రాజరాజేశ్వరి పేటలో వరద బాధితులను ఇవాళ పీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల పరామర్శించారు.ఈ సందర్భంగా బుడమేరు వరదపై టీడీపీ -వైసీపీ బురద రాజకీయాలు చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. బుడమేరు వరదకు ఇద్దరూ కారణమే అన్నారు. ఒకరు కాంట్రాక్టులు ఇచ్చారట. మరొకరు వాటిని రద్దు చేశారట అంటూ సెటైర్లు వేశారు.విజయవాడ వరదలకు 7 లక్షల మంది నిరాశ్రయులైతే ప్రభుత్వం నిద్రపోతోందని షర్మిల మండిపడ్డారు. చంద్రబాబు విరాళాలు తీసుకోవాల్సింది చిన్న పిల్లల దగ్గర కాదని, చేతనమైతే కేంద్రం నుంచి సాయం తీసుకురావాలన్నారు. వరదలకు 6800 కోట్లు నష్టం జరిగిందని బాబు చెప్పారని, ఆయన చెప్పిన నష్టం వరకు అయినా కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు.వస్తున్నారు..నష్టం అంచనా అంటున్నారు, రూపాయి మాత్రం కేంద్రం నుంచి రాలేదని ఆరోపించారు. ఇంత నష్టం జరిగింతే మోడీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు.బీజేపీ చేసిన మోసం



పై చంద్రబాబు సమాధానం చెప్పాలని షర్మిల కోరారు. విజయవాడకి రైల్ నీర్ ఇవ్వాలని తాను కేంద్రమంత్రికి లేఖ రాసినా సమాధానం లేదన్నారు. విజయవాడ నుంచి ప్రతి ఏటా 6 వేల కోట్ల ఆదాయం వస్తుందని,ఇంతా ఆదాయం వస్తుంటే కేంద్రం కనీసం మంచినీళ్ళ కూడా ఇవ్వలేదని షర్మిల విమర్శించారు. చంద్రబాబు చిన్న పిల్లల దగ్గర డబ్బులు తీసుకోవడం విడ్డూరమని, బాబు డబ్బులు తీసుకోవాల్సింది బీజేపీ నుంచి అని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర ఎంపీలు బీజేపీ లో ఊడిగం చేస్తున్నారని, ఇదో పబ్లిసిటీ స్టంట్ అని అన్నారు. బీజేప నుంచి డబ్బులు తీసుకురాలేకపోతే ఎన్డీయే నుంచి తప్పుకోవాలన్నారు.

## వరద బాధితులకు సర్వేపల్లి పారిశ్రామికవేత్తల రూ.3 కోట్ల విరాళం



విజయవాడ: ఏపీలో వరద బాధితులను ఆదుకునేందుకు నెల్లూరు జిల్లా సర్వేపల్లి పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. మాజీ మంత్రి సోమిరెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గం నుంచి రూ. 3 కోట్ల విరాళం అందించారు.జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ లిమిటెడ్ సీఎం సహాయ నిధికి రూ. 2 కోట్ల విరాళాన్ని అందించగా.. పామాయిల్ పారిశ్రామికవేత్తలు రూ.50 లక్షల చొప్పున విరాళం ఇచ్చారు. విజయవాడ కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబును కలిసి చెక్కులు అందించారు.మరోవైపు ఎక్సైజ్ ఉద్యోగుల ఐకాస రూ.2.70కోట్ల విరాళం ప్రకటించింది. మంగళవారం సీఎం చంద్రబాబును ఐకాస నేతలు కలిసి చెక్కు అందజేశారు.

## జగన్ ఐదేళ్ల పాలన అంతా అరాచకం : తెదేపా



అమరావతి : ప్రకాశం బ్యారేజీ గేట్లను పడవలతో ఢీకొట్టిన ఘటన వైకాపా అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, నందిగం సురేష్, తలశీల రఘురాంల కుట్రేనని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు.అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గత ఐదేళ్ల జగన్ పాలన అంతా అరాచకమని మండిపడ్డారు. కుట్రలు, కుతంత్రాలతో వైఎస్ జగన్ పాలన సాగించారని విమర్శించారు. జగన్ పాలన అంతా నేరపూరితమేనన్నారు. జాతీయ సంపదైన ప్రకాశం బ్యారేజీను కుట్రతో ధ్వంసం చేయాలనుకున్నారని, ఇది దేశ ద్రోహం నేరంతో సమానమని మండిపడ్డారు. చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేయాలని కుట్ర పన్ని పడవలతో ప్రకాశం బ్యారేజీని ఢీ కొట్టేలా వ్యూహం పన్నారని ధ్వజమెత్తారు. ఆ పడవలు సరిగ్గా బ్యారేజీని ఢీకొని ఉంటే గ్రామాలన్నీ మునిగిపోయి ప్రజలు ధన, ప్రాణాలు కోల్పోయే వారన్నారు. పోలీసుల రిమాండ్ రిపోర్టులో ఇది కుట్ర అని.. ఈ ఘటన వెనుక ఎవరు ఉన్నా వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు.

## ప్రయాణించిన దూరానికే ఛార్జీ.. శాటిలైట్ ఆధారిత టోల్‌ను నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: శాటిలైట్ ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ వసూలు దిశగా మరో ముందడుగు పడింది. ఎప్పటి నుంచో ఈ విధానాన్ని తీసుకొస్తామని ప్రకటిస్తూ వస్తున్న కేంద్ర రవాణా శాఖ.తాజాగా దీన్ని నోటిఫై చేసింది. ఈ మేరకు జాతీయ రహదారుల ఫీజు నిబంధనలను (2008) సవరిస్తూ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం.. టోల్ ప్లాజాల వద్ద కొత్తగా గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ఆధారిత టోల్ విధానం అమల్లోకి రానుంది. ప్రస్తుతం అనుసరిస్తున్న ఫాస్టాగ్, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ టెక్నాలజీకి అదనంగా ఈ కొత్త విధానం అమలు కానుంది.నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్‌తో కూడిన ఆన్ బోర్డు యూనిట్ కలిగిన వాహనాలు టోల్ ప్లాజా మీదుగా వెళ్లినప్పుడు.. ప్రయాణించిన దూరానికి గానూ టోల్ ఫీజు ఆటోమే



టిక్‌గా చెల్లింపు జరిగిపోతుంది. ఈ తరహా వాహనాలకు ప్రత్యేక లేన్‌లను అమర్చనున్నారు. నావిగేషన్ డివైజ్ లేని వాహనాలకు సాధారణ టోల్ ఛార్జీలే వర్తిస్తాయి. అలాగే, కొత్తగా 20 కిలోమీటర్ల వరకు జీరో టోల్ కారిడార్‌ను తీసుకొచ్చారు. అంటే జాతీయ రహదారిపై 20 కిలోమీటర్ల వరకు టోల్ చెల్లించాల్సిన అవసరం లేదు. ఆపై ప్రయాణిస్తే దూరానికి తగ్గట్లు టోల్ చెల్లించాల్సి ఉంటుంది. టోల్ ప్లాజాల వద్ద రద్దీని తగ్గించేందుకు కేంద్రం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తోంది. ఒకప్పుడు మాన్యువల్‌గా చెల్లించే విధానం ఉండగా.. కొన్నేళ్ల క్రితం ఫాస్టాగ్‌ను తీసుకొచ్చారు. దీంతో కొన్ని సెకన్ల పాటు వాహనం ఆపి తర్వాత ముందుకెళ్లాల్సి ఉంటుంది. పైగా కిలోమీటర్లతో సంబంధం లేకుండా టోల్ చెల్లించాల్సిందే. కొత్త విధానంలో వాహనంలో ఉండే డివైజ్ ఎంత దూరం ప్రయాణించిందీ లెక్కగడుతుంది. దీంతో ప్రయాణించిన దూరానికే టోల్ చెల్లించాల్సి ఉంటుంది. పైగా టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేదు. తొలుత ప్రధాన జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై ఈ విధానాన్ని అమలు చేసి... తర్వాత దేశవ్యాప్తంగా తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

## నలుగురు వ్యోమగాములతో.. నింగిలోకి స్పేస్‌ఎక్స్ రాకెట్



న్యూఢిల్లీ : ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని 'స్పేస్‌ఎక్స్' అంతరిక్ష సంస్థ చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది.తొలిసారి అంతరిక్షంలో ప్రైవేటు స్పేస్‌వాక్ నిర్వహించేందుకుగానూ.. 'పోలారిస్ డాన్' ప్రాజెక్టు కింద నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపింది. ఈ మేరకు ఫ్లోరిడాలో కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్-9 రాకెట్ దూసుకెళ్లింది.ఈ మొత్తం మిషన్‌కు వ్యాపారవేత్త జేర్డ్ ఇస్సాక్‌మన్ నేతృత్వం వహిస్తున్నారు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ మాజీ ఉద్యోగి స్కాట్ కిడ్ దీనికి పైలట్‌గా వ్యవహరిస్తున్నారు. వారితోపాటు స్పేస్‌ఎక్స్‌కు చెందిన మిషన్ ఇంజినీర్లు సారా గిల్లి, అన్నా మెనోన్ ఉన్నారు. పోలారిస్ మిషన్‌లో తలపెట్టిన మూడు మానవసహిత యాత్రల్లో ఇది మొదటిది. ఈ ప్రాజెక్టులో మొత్తం స్పేస్‌ఎక్స్ పరికరాలనే వినియోగిస్తారు.

## త్వరలో 'ఆపరేషన్ బుడమేరు': మంత్రి నారాయణ



విజయవాడ: వరద బాధితులకు ఆహారం, తాగునీరు పంపిణీలో ఇబ్బంది లేకుండా చూశామని మంత్రి నారాయణ తెలిపారు. పారిశుద్ధ్యం విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వరద పరిస్థితుల్ని వివరించారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు ఆహారం అందించాలని సీఎం ఆదేశించారని తెలిపారు."ఇప్పటి వరకు 77వేల విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించాం. వరద ప్రాంతాల్లోని నీటిని మరో రెండ్రోజులు తాగొద్దని ప్రజలకు సూచించాం. బుడమేరులో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో 'ఆపరేషన్ బుడమేరు' చేపడతామని సీఎం చంద్రబాబు చెప్పారు"అని మంత్రి తెలిపారు.

# ఓ లారీ డ్రైవరన్నా... నీకు సాటి ఎవరన్నా!



- పత్రిక మూలంగా రవాణా శాఖ మినిస్టర్ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విన్నపం.
- మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి లారీ డ్రైవర్ కు ఏటా 15000 రూపాయలు వెంటనే అమలుపరచాలి.
- డ్రైవర్ల సాధికార సంస్థను ఏర్పాటు చేయాలి.
- రెన్యువల్ తో పాటు ప్రమాద బీమా హెల్త్ ఇన్సూరెన్స్ ఉచితంగా అమలు చేయాలి.
- వాహనాల కొనుగోలుకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి.
- త్వరలో జేఏసీ నియామకం

రాయల్ జర్నలిజం,రాయచోటి,సెప్టెంబర్ 10:-లారీ డ్రైవర్లకు అనేక సమస్యలున్నాయి. వారు ఎదుర్కొనే సమస్యలు తెలుసుకునేందుకు పబ్లిక్ టుడే చిన్న ప్రయత్నం చేసింది.వాళ్లు లేనిదే రవాణా వ్యవస్థ లేదు. ఏ నిత్యావసర వస్తువు సరైన సమయంలో గమ్యం చేరదు. వారే లేకుంటే ఎన్నో పరిశ్రమలు సైతం మూతపడాల్సిందే."పరిమిత సంపాదనతో కష్టపడి పనిచేసే తరగతిని కఠినమైన చట్టబద్ధమైన కొలిమిలో పడేయడం వారి జీవితాలను చెడుగా ప్రభావితం చేస్తుంది. ఇంతటి గొప్ప ప్రఖ్యాతి చెందిన వారు ఎవరో కాదు రవాణా వ్యవస్థ రథ సారథులుగా పిలువబడుతున్న లారీ డ్రైవర్లు. నేటి స్పీడ్ యుగంలో రవాణా వ్యవస్థ చాలా కీలకం. ఏ వస్తువు లేకుండా మానవ మనుగడ సాగడం కష్టతరం. ఇలాంటి పరిస్థితుల్లో రవాణా వ్యవస్థలో ప్రధాన కీలక పాత్ర పోషించే వారుగా లారీ డైవర్లను చెప్పవచ్చు. అయితే లారీ డ్రైవర్లకు అనేక సమస్యలున్నాయి. వారు ఎదుర్కొనే సమస్యలు తెలుసుకునేందుకు పబ్లిక్ టుడే చిన్న ప్రయత్నం చేసింది. ఎప్పుడు వెళ్తారో తెలీదు..ఎప్పుడు వస్తారో తెలీదు,లారీ డ్రైవర్లు ఇంటి వద్ద టాటా చెప్పింది మొదలు, మరలా ఇంటికి చేరేవరకు వారి ప్రాణాలపై వారికే నమ్మకం లేని పరిస్థితి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితుల్లో లారీ డ్రైవర్లు తమ విధులను నిర్వహిస్తూ తమకంటూ ప్రత్యేకత చాటుకుంటున్నారు. నిద్ర ఉండదు, సమయానికి ఆహారం ఉండదు ఇలా ఎన్నో కష్టతర జీవితాన్ని గడుపుతున్న లారీ డ్రైవర్లకిచ్చే గౌరవము కూడా అంతంత మాత్రమే! అటు లారీ డ్రైవర్ల కుటుంబాలలో ఆర్థిక పరిపుష్టి చాలా తక్కువనే చెప్పాలి. నిద్ర లేని బతుకులు: సరుకు సమయానికి గమ్యానికి చేర్చాలన్న ఉద్దేశంతో నిద్రకు ఉపక్రమించే సమయము వీరికి తక్కువే. ఒకవేళ నిద్రపోవాలన్నా ఆ లారీలోనే ఇరుకు స్థితిలో నిద్ర పోవాల్సిందే. లారీ డ్రైవింగ్ వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న వీరు, ఇంటికి చేరేవరకు వారి కుటుంబ సభ్యుల ఎదురుచూపులకు అంతులేదు. పలువురు లారీ డ్రైవర్లు విధి నిర్వహణలో వేరే రాష్ట్రానికి వెళ్లిన క్రమంలో, కుటుంబ సభ్యులలో ఎవరైనా ఒకరు చనిపోతే అప్పటి పరిస్థితి ఊహించుకుంటునే బాధ కలుగుతోంది. . ఈ పరిస్థితి గురించి చెబుతూ ఓ లారీ డ్రైవర్ పబ్లిక్ టుడే తో తన కన్నీటిని ధార పోశాడు.తాము రవాణా రంగంలో కీలక వ్యక్తులమైనా, దొరికే గౌరవం మాత్రం అంతంత మాత్రమేనని లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం లారీ డ్రైవర్లుగా రాణించేందుకు కొత్తగా వచ్చేవారు ఈ వృత్తిలోకి రావద్దని స్వతహాగా లారీ డ్రైవర్లు తెలపడం విశేషం. ప్రతిరోజు తమ రక్తపు బొట్టును పణంగా పెట్టి, కుటుంబ పోషణ సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, చాలీచాలని డబ్బులతో బతుకు జీవుడా అంటూ జీవితం కొనసాగిస్తున్నట్లు లారీ డ్రైవర్లు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం హామీలో భాగంగా తెలుగుదేశం మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి లారీ టిప్పర్, ట్రిప్పర్ డ్రైవర్లకు ఏటా 15000 వెంటనే అందించాలి. డ్రైవర్ సాధికార సంస్థ ఏర్పాటు చేసి అన్ని వర్గాల డ్రైవర్లకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్ ,విద్యా రుణాలు వంటి సంక్షేమ




కార్యక్రమాలు అమలు చేయాలి. డ్రైవర్లను ఓనర్లు చేసే లక్ష్యంతో వాహనాల కొనుగోలుకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలి. పోలీసులు వేధింపులను అరికట్టాలి.రహదారులను ఆక్రమణదారుల నుంచి రక్షించాలి. ఆక్రమణ వల్ల ప్రమాదాలకు కారకులైన ఆక్రమణదారులను శిక్షించాలి. ప్రమాదాలు సంభవించినప్పుడు ఎటువంటి పూచి లేకుండా డ్రైవర్ లైసెన్స్ ను ప్రమాణికంగా చేసుకొని బెయిల్ మంజూరు చేయాలి. వీటిపై స్పందించి గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరియు గౌరవ రవాణా శాఖ మినిస్టర్ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చర్యలు తీసుకుంటారని పలువురు లారీ డ్రైవర్లు పత్రిక మూలంగా కోరడమైనది.ఇలా ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నా, ప్రజా రవాణా వ్యవస్థలో నేటికీ కొనసాగుతూ తమ విధులను నిర్వహిస్తున్న లారీ డ్రైవర్లకు మనమందరం డ్రైవర్ అన్నకు గౌరవిద్దాం బాసటగా నిలుద్దాం.

## ముసునూరు మండలంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి సుడిగాలి పర్యటన



రామనసముద్రం,ముసునూరు/నూజివీడు/ఏలూరు, సెప్టెంబరు,10:(నిఘా విలేకరి) భారీ వర్షాలతో తలెత్తిన సమస్యలను స్వయంగా పరిశీలించేందుకు మంగళవారం ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర గృహనిర్మాణశాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ముసునూరు, చింతలపల్లి, గోగులంపాడు, చెక్కపల్లి, గ్రామాల్లో పర్యటించి భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో భాగంగా రహదారులకు యుద్ధప్రాతిపధికన తాత్కాలికంగా రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యానికి అనువుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ముసునూరులో రైతులకు వెళ్లే రహదారుల్లో వాగుల నుండి వచ్చే వరదనీరు తూముల ద్వారా వెళ్లుటకు అవసరమైన చోట్ల కొత్తవి నిర్మాణానికి ప్రతిపాధనలు తయారుచేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో డ్రైనేజి వ్యవస్థ, వైద్య సేవలు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణీ, తదితర అంశాలపై మంత్రి ప్రజల నుండి అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు ఇచ్చారు. అదే విధంగా మండలంలోని రైతాంగానికి మినుము, పత్తి పంటల నష్టానికి సంబంధించిన నివేదికలను తయారు చేసి సిద్ధం చేయాలని మంత్రి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్యం పనులు చేపట్టాలని పంచాయితీ అధికారులను ఆదేశించారు. చెక్కపల్లి గ్రామంలో ఉన్న చెరువు వర్షపునీటితో నిండివుండటం వల్ల వాటిని బయటకు పంపడానికి చెరువు గట్టును అధికారులతో కలిసి మంత్రి పరిశీలించడం జరిగింది. గణపతి నవరాత్రుల మహోత్సవాలు సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడిని రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారధి దర్శించుకున్నారు. వీరివెంట పశుసంవర్ధక శాఖ జెడి జి. నెహ్రూబాబు, తహశీల్దారు రాజ్ కుమార్, ఆర్అండ్ బి డిఇ బాబూరావు, ఎఇ అశోక్ బాబు, ఇవోపిఆర్డి ఎస్.వి. శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు,

# విశ్వనాథ నారాయణ 129వ జయంతి వేడుకలు

బాపట్ల ,సెప్టెంబర్ 10 ( రాయల్ జర్నలిజం) తెలుగు సాహిత్య ఔన్నత్యాన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రజ్వలింప చేసిన మహోన్నత సాహితీవేత్త విశ్వనాథ సత్యనారాయణ అని ప్రజా కవి డాక్టర్ శ్రీనివాసుల శ్రీనివాస్ అన్నారు.సాహితీ భారతి ఆధ్వర్యంలో మంగళవారం బాపట్ల పట్టణంలోని జమీందారు పేట లోహౌజరిగిన విశ్వనాథ సత్యనారా యణ 129 వ జయంతి సభ కు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. విశ్వనాథ సత్యనారాయణ ఒక్క వచన కవిత తప్ప మిగిలిన అన్ని సాహిత్య ప్రక్రియల్లో అద్భుత రచనలు చేసి, సాహితీవేత్తహాలెందరికో మార్గద ర్శకులయ్యారని కొనియాడారు. సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ విశ్వనాథ వారు రచించిన శ్రీమద్రా మా యణ కల్పవృక్షం రచనకు తొలి తెలుగు జ్ఞానపీఠ్ అవార్డు ప్రదానం చేయబడిందన్నారు. వారుకిన్నెరసాని, వేయిపడగలు,ఏకవీర,వంటి ఎన్నో గొప్ప రచనలు చేశారని ప్రశంసించారు.మద్రి మాల్యాద్రి రావు మాట్లాడుతూ విశ్వనాథ వారు రచించిన వేయి పడగలు నవలను భారత మాజీ ప్రధాని అయిన పీ వి నరసింహారావు సహస్ర ఫణ్ అనే పేరుతో హిందీలో అనువదించారని తెలియ చేశారు. దాదాపువేయి పేజీలున్న వేయిపడగలు నవలను విశ్వనాథ వారు కేవలం ముప్పై రోజుల్లోనే రచించటం ఒక అద్భుతమని అన్నారు.ఈ సభలో ఎం జాకబ్ కస్తూరి శ్రీనివాసరావు బొడ్డుపల్లి శ్రీరామ చంద్ర మూర్తి పువ్వాడ వెంకటేశ్వర్లు కాళిదాసు తదితరులు విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

## మీడియా మిత్రుల ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం అన్నసంతర్పణ



బాపట్ల, సెప్టెంబర్ 10 ( రాయల్ జర్నలిజం) దేవుని పట్ల ప్రతి ఒక్కరికి భక్తి భావాలు ఉండాలని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ , మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ లు అన్నారు.వినాయక చవితి నవరాత్రుల పండగలో భాగంగా మంగళవారం బాపట్ల నియోజకవర్గం మీడియా మిత్రుల ఆధ్వర్యం లో పట్టణ పోలీస్ స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వారు మాట్లాడుతూ దేవుని పట్ల ప్రతి ఒక్కరూ భక్తి భావాలు పెంపొందించు కోవాల న్నారు. భక్తి ఉన్నచోటే మంచి లక్షణాలు ఉంటాయన్నారు. తొమ్మిది రోజులు పాటు అధిపతి ఆదిదేవుడు గణపతిని పూజించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని, సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన తెలియజేశారు. అనంతరంవిఘ్నేశ్వరుడి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని, పాత బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి విగ్రహం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నా మన వెంకట శివ నారాయణ,మీడియా మిత్రులు, ఆటో యూనియన్ , డ్రైవర్స్,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో గడపాలి



రాయల్ జర్నలిజం,రాయచోటి,సెప్టెంబర్10:గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో గడపాలని పట్టణ సీఐ చంద్ర శేఖర్ కోరారు. పట్టణంలోని మదనపల్లె రోడ్డు మార్గం ఏం ఎన్ ఆర్ కాలనీలో కొలువుదీరిన వినాయకుడిని ఆయన దర్శించుకున్నారు. టిడిపి నేత మడితాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో వినాయకుని సన్నిధిలో వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల మతాలకతీతంగా చిన్న పెద్ద అని తేడా లేకుండా సంబరంగా జరుపుకునే పండుగలలో ప్రధానమైనది వినాయక చవితి అని చెప్పుకోవచ్చన్నారు. అదేవిధంగా దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు దైవభక్తిని పెంపొందించేలా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఈ పండగ ప్రత్యేకత అన్నారు. వినాయకుని నిమజ్జనం సమయాలలో కమిటీ నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆయన తో పాటు ఎస్సై నరసింహారెడ్డి ని దుశ్శాలవతో సన్మానించి పూలమాలలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు జంగం రెడ్డి, సురేష్ రెడ్డి, మహమ్మద్, రాయుడు కాలని టిడిపి నాయకులు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని రాస్తా రోకో

### కూటమి నేతలు కేంద్రంపై ఒత్తిడితెచ్చి విశాఖఉక్కు ప్రేవేటీకరణ ఆపాలని డిమాండ్

### దొడ్డిదారి ప్రేవేటీకరణ ప్రయత్నాలు మోడీ ప్రభుత్వం ఆపాలని నినాదాలు



రాయల్ జర్నలిజం (రాయచోటి) సెప్టెంబర్ 10: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష ట్రేడ్ యూనియన్లు రైతు సంఘాల ఆధ్వర్యంలో బంగ్లా సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి. శ్రీనివాసులు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు సీపీఐ యం యల్ యం. విశ్వనాథ్ యం ఆర్ పి యస్ జాతీయ నాయకులు రామాంజులు రైతు సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు రంగారెడ్డి బసిరెడ్డిలు మాట్లాడుతూ,9వేల కోట్ల పెట్టుబడికి 58 వేల కోట్ల డివిడెండ్ చెల్లించిన విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఇందులో భాగంగానే బ్లాస్ట్ ఫర్నేస్ రెండింటిని ఉద్దేశపూర్వకంగా మూసివేశారని, 75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం నుండి 30 లక్షల టన్నులకు స్టీల్ ఉత్పత్తి పడిపోనుందని తెలిపారు. దీంతో అనివార్యంగా నష్టాలలోకి విశాఖఉక్కును నెట్టాలని బీజేపీ మోడీ ప్రభుత్వం భావిస్తోందని, రాష్ట్ర పార్లమెంట్ సభ్యులు బలంపై ఆధారపడి నడుస్తున్న కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిచేసి విశాఖఉక్కు ప్రేవేటికరణ ఉపసంహరణ ప్రకటనను కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేయించాలని డిమాండ్ చేశారు. సొంత ఘనులు విశాఖఉక్కుకు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో, 64 ఎంపీల రాజీనామాలతో, 32 వేల ఎకరాల రైతుల భూమిని సేకరించి నిర్మించుకున్న విశాఖ ఉక్కును వదులు కోవడానికి రాష్ట్రాల్లో ప్రజలు సిద్ధంగాలేరని, అవసరమైతే మరో అంతిమ పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ వి రమణ కె సుబ్రహ్మణ్యం రాజు, మాధవయ్య చెన్నయ్య అశోక్,హర్ష జె సుధాకర్ ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్రమ్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు, నర్సింహులు రవేణు గోపాల్ రెడ్డి, మురళి, వెంకటరమణ ఆకార్స్ యూనియన్ నాయకులు చంద్ర, సిపిఐయంయల్ నాయకులుపూసపాటి రమణ పాల్గొన్నారు.

# పెద్దమండెం మండలం గుడిసివారిపల్లి చెరువు మలుపులో రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు పంపాలి

### జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



రాయల్ జర్నలిజం (పెద్దమండెం) సెప్టెంబర్ 10: పెద్దమండెం మండలం గుడిసివారిపల్లి చెరువు మలుపులో రోడ్డు విస్తరణకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని ఇరిగేషన్ మరియు ఉపాధి హామీ అధికారులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు.మంగళవారం పెద్దమండెం మండలం పాపేపల్లి పంచాయితీ గురివిరెడ్డిగారి పల్లి సమీపంలోని గుడిసివారిపల్లి చెరువును జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ నెల 9 సోమవారం సాయంత్రం గణేష్ నిమజ్జనం సందర్భంగా గురివిరెడ్డిగారి పల్లి సమీపంలోని గుడిసివారిపల్లి చెరువులో ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో, ఒక బాలుడు మృతి చెందగా పలువురు గాయపడిన ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. జరిగిన దుర్ఘటనపై అధికారులు, గ్రామస్తులను కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సంఘటనలు పురావృతం కాకుండా అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని, చిన్నపిల్లలను నిమజ్జనంలో పాల్గొనకుండా అవగాహన కల్పించాలని, తల్లిదండ్రులు, గ్రామస్తులు కూడా ఈ విషయంలో అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా గుడిసివారిపల్లి చెరువు పై నున్న మలుపు రహదారిని కొద్దిగా విస్తరించాలని అక్కడి గ్రామస్తులు కలెక్టర్కు విన్నవించారు. ఈ విషయమై సాధ్యాసాధ్యాలను పరిశీలించి మలుపు వద్దనున్న రోడ్డు విస్తరణకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని ఇరిగేషన్ మరియు ఉపాధి హామీ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. అనంతరం గురువు రెడ్డి గారి పల్లి అంగన్వాడి కేంద్రాన్ని కూడా కలెక్టర్ పరిశీలించి, కేంద్రం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో తాసిల్దారు షహీద్ అహ్మద్, ఎంపీడీవో శ్రీధర్, ఉపాధి హామీ, ఇరిగేషన్ శాఖల సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిమర్జన ఊరేగింపులో మహాగణపతి



రామసముద్రం.సెప్టెంబర్ 10 రాయల్ జర్నలిజం: రామసముద్రం మండలపరిధి లోని మేజర్ పంచాయతీ చెంబకూరు, మాలపల్లె మానేవారిపల్లె లలో అంగరంగ వైభవంగా బొజ్జ గణపయ్యకు నిమజ్జనం జరిగింది,యువకులు ఎంతో సంతోషంగా రంగులు చల్లుకొని వినాయకస్వామిని గ్రామ పురవీదుల్లో ఊరేగింపు చేశారు,గ్రామాల్లో బాణా సంచాలు కాల్చి బళ్లారి డ్రమ్స్ వాద్యాలు మధ్యయువకులు డాన్స్ వేసుకొని మహా గణపతి స్వామిని ఊరేగింపు , యువకులు మహిళలు రంగులు చల్లుకొని సంతోషంగా వినాయకుని నిమజ్జనం ప్రశాంతంగాజరిగింది ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్సై చంద్రశేఖర్ పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో చెరువులో వినాయకుని నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది నిమిజ్జనం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించడం జరిగింది. చెంబకూరు గణేష్ శావసమతి ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించి చెల్లా చెరువులో నిమర్జనం చేశారు.

## జిల్లా వ్యవసాయ అధికారి ఐతే నాగేశ్వరావు

## చెన్నూరు రైతు సేవా కేంద్రం ఆకిస్మక తనికి



(చెన్నూరు,) రాయల్ జర్నలిజం,సెప్టెంబర్, 10: జిల్లా వ్యవసాయ అధికారి ఐతే నాగేశ్వరరావు మంగళవారం చెన్నూర్ 3 రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ చేయడం చెస్తారు. ఈ పంట మరియు ఈ కేవైసీ జరుగుతున్న తీరును పరిశీలించినారు. సెప్టెంబర్ 15 చివరి తేదీ కావున రైతులు ఈ పంట మరియు ఈ కేవైసీ ని పూర్తి చేసుకోవాలని తెలియజేశారు. గ్రామంలోని వరి మరియు బంతి (చెండుమల్లి) పొలాలను సందర్శించడం జరిగినది .వరిలో సూడోమనస్ లీటరు నీటికి పది గ్రాములు పిచికారి చేయడం వలన పాముపొడ మరియు అగ్గి తెగులు రాకుండా కాపాడుకోవచ్చని రైతు లుకుతెలియజేశారు.అదేవిధంగా రైతులు పురుగుమందులు పిచికారి చేసేటప్పుడు పురుగు ఉధృతి అనగా నిర్ణీత తీవ్రత స్థాయి అనగా ఉదాహరణకు వరిలో ఆకుముడుత కలుగజేసే పురుగు దుబ్బుకి ఒక లార్వా లేదా రెండు పురుగు సోకిన ఆకులు ఉన్నప్పుడు పిచికారి చేయవలెను లేదంటే పిచికారి చేయనవసరం లేదు అని తెలియజేశారు. బంతి వేసిన పొలం సందర్శించి ట్రైకోడెర్మా పశువుల ఎరువులతో అభివృద్ధి చేసి వేయుట వలన పూలు నాణ్యత మరియు సైజు పెరుగునని తెలియజేశారు.మండలవ్యసాయదికారి శ్రీ దేవి సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్-షర్మిల మధ్య రాజీ.. 'లోటస్ పాండ్' ఎవరికంటే?



అమరావతి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి వారసులుగా రాజకీయాల్లోకి వచ్చిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్.షర్మిల. 2019 వరకు కలిసి పనిచేశారు.కాంగ్రెస్‌ను విభేదించి సొంత పార్టీ పెట్టుకున్నారు. ఈ క్రమంలో పార్టీని బలోపేతం చేయడానికి ఇద్దరూ పాదయాత్ర చేశారు. జగన్ జైలులో ఉన్న సమయంలో పార్టీ బాధ్యతను షర్మిల చూసుకున్నారు. ఇద్దరి కష్టంలో 2019లో ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అయితే ఇక్కడి నుంచి ఇద్దరి మధ్య దూరం పెరిగింది. ఎందుకు పెరిగింది అనేది ఇప్పటికీ ఎవరూ బయటపెట్టలేదు. కానీ, పదవుల కోసమే అన్న ప్రచారం జరిగింది. చివరకు షర్మిల అన్నను విభేదించి తెలంగాణలో కొత్త పార్టీ పెట్టుకుంది. 2023లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైంది. కానీ, కాంగ్రెస్‌తో మంతనాలు జరిపి చివరకు తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసింది. దీంతో తెలంగాణ ఎన్నికల తర్వాత షర్మిల ఏపీ పీసీసీ అధ్యక్షురాలయ్యారు. కానీ, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీతరఫున పోటీ చేసిన ఒక్క ఎమ్మెల్యేను కూడా గెలిపించలేకపోయారు. చివరకు తాను కూడా కడప ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. కానీ, అన్న జగన్‌కు చెందిన అధికార వైసీపీ ఓటమిలో కీలకపాత్ర పోషించారు. తీవ్రస్థాయిలో షర్మిల జగన్‌పై యాంటీ ప్రచారం చేశారు. ఇక, ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా.. రాష్ట్రంలో ఏం జరిగినా దాని ని జగన్ పాలనకు అంటగట్టి విమర్శలు గుప్పించారు. అయితే.. ఈ విమర్శలకు, టార్గెట్‌కు కారణం.. వారసత్వపు ఆస్తుల పంపకాల్లో వచ్చిన తేడాలే కారణమన్నది రాజకీయ వర్గాల విశ్లేషణ.

**మౌనంగా విజయమ్మ..**

ఈ విషయంలో జగన్, షర్మిల తల్లి విజయమ్మ కూడా ఏమీ చేయలేక పోయారన్న వాదన ఉంది. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లోని లోటస్ పాండ్ ను తమకు ఇచ్చేయాలన్నది షర్మిల డిమాండ్ చేస్తున్నారని ఏడాది కాలంగా చర్చనడుస్తోంది. ఈ విషయంలో జగన్ పంతానికి పోయారని.. దానిని ఇచ్చేది లేదని తేల్చి చెప్పారని కూడా కొన్నాళ్లు విశ్లేషణలు వచ్చాయి. అయితే.. ఇప్పుడు లోటస్‌పాండ్ షర్మిల వశం అయినట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. షర్మిల తనపై దూకుడు తగ్గిస్తేనే తప్ప.. రాజకీయంగా తాను పుంజుకునే పరిస్థితి లేదనిజగన్ భావించారని వైసీపీకి చెందిన అత్యంత విశ్వసనీయ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ప్రత్యర్థులతో పోరాటం చేయొచ్చు కానీ.. సొంత వారే పగవారై.. సూటి పోటి మాటలతో విమర్శలు గుప్పిస్తే.. ఎలా అన్నది జగన్ మాటగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే కర్ణాటకకు చెందిన ఓ సీనియర్ రాజకీయ నేత, వైఎస్ కుటుంబంతో అతి దగ్గర సంబంధాలు ఉన్న వ్యక్తి ద్వారా.. మంత్రాంగం జరిగినట్టు తెలుస్తోంది.

**లోటస్‌పాండ్ వదులుకున్న జగన్..**

రాజీ చర్చల్లో హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌ను జగన్ వదులుకున్నారన్నది తాజాగా తెలిసిన విషయం. ఈ పరిణామాలతోనే షర్మిల.. తగ్గుతున్నారని.. అన్నను టార్గెట్ చేసే విషయంలో ఆచితూచి వ్యవహరించే అవకాశం ఉందని అంటున్నారు. అయితే.. దీనిలో ఎంత నిజం ఉందనేది తెలియాల్సి ఉంది. ఎందుకంటే.. మూడు రోజుల కిందట కూడా.. జగన్‌ను షర్మిల దుయ్యబట్టారు. ప్రాజెక్టులను సరిగా నిర్వహించనందుకే.. బుడమేరు పొంగి.. ఊళ్లు నీట మునిగాయని ఆమె ఆరోపించారు.

# వామ్మో వదలని వరుణుడు.. వచ్చే వారం బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!



అమరావతి : రాష్ట్రంలో ఇప్పటికే కురుస్తున్న వర్షాలు ముంచెత్తుతుంటే వాతావరణ శాఖ మరో బాంబు పేల్చింది. సెప్టెంబర్ 20 నుంచి 22 మధ్యలో మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. సెప్టెంబర్ 27వ తేదీ నాటికి ఇది తీరం సమీపానికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెల్పింది. ఇది ఉత్తరాంధ్రకు దగ్గరగా వస్తుందని, అయితే ఒడిశా వైపు కదిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే తుపాను కూడా ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెల్పింది. అయితే ఈ తుపాను రాష్ట్రంపై ఎంత ప్రభావం చూపుతుందనే దానిపై వారం రోజుల్లో స్పష్టత వస్తుందని వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఇక ప్రస్తుతం బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం సోమవారం ఒడిశాలోని పూరీ వద్ద తీరం దాటింది. ఇది వాయువ్య దిశగా పయనించి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. దీని ప్రభావంతో మంగళవారం వరకు ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇక మిగిలిన చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉన్నట్లు వాతావరణ కేంద్రం తెల్పింది. దక్షిణ కోస్తా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెల్పింది. వాయుగుండం ప్రభావం వల్ల ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో ఆది, సోమ వారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 13.7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. చింతపల్లిలో 13.4, ముంచింగిపుట్టులో 13.3, గంగవరంలో 12.4, అడ్డతీగలలో 11.7 సెంటీమీటర్ల వర్షం పడింది. అనకాపల్లి జిల్లా గోలుగుండలో 11.2, విజయనగరం పూసపాటిరేగలో 11, అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగిలో 10.9, శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో 10.5, అనకాపల్లి జిల్లా నాతవరంలో 10 సెంటీమీటర్ల వర్షం పడింది. మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలుపడనున్నాయి. ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ రోజు హైదరాబాద్ లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నగరంలోని పలు ప్రాంతాలలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 30 నుండి 40 కి. మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

# ఈనెల 11న గుంటూరు జైలుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్..

## *తరలి రావాలని వైసీపీ శ్రేణులకు పిలుపు*



అమరావతి :మాజీ లోక్‌సభ సభ్యుడు నందిగం సురేశ్‌ను, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరామర్శించనున్నారు. ఈనెల 11న బుధవారం ఉదయం 11 గం.కు ఆయన గుంటూరు జైలుకు వెళ్లి నందిగం సురేశ్‌ను కలుసుకుంటారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యథేచ్ఛగా వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులను కొనసాగిస్తోంది. చట్టాన్ని ఉల్లంఘించి మరీ అరెస్టు చేస్తోంది అని వైసీపీ ఆరోపిస్తోంది. దీంట్లో భాగంగా నందిగం సురేశ్‌ను కూడా అరెస్టు చేశారని వైసీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి అరెస్టులు**

మూడేళ్ల క్రితం అప్పటి సీఎం జగన్‌పై టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి తీవ్ర పదజాలంతో దూషణల నేపథ్యంలో ఆనాడు టీడీపీ కార్యాలయం వద్ద చోటు చేసుకున్న ఘటనల కేసులో ఉద్దేశపూర్వకంగా కొందరు వైసీపీ నాయకులను ఇరికించారు అని వైసీపీ ఆరోపిస్తోంది. వారిపై తప్పుడు కేసులు బనాయించారని ధ్వజమెత్తింది. మూడేళ్ల క్రితం ఈ ఘటన జరిగినా...ఉద్దేశపూర్వకంగా కొంతమందిని సాక్షులతో స్టేట్‌మెంట్లు తీసుకుని, నందిగం సురేశ్‌తో పాటు, మరికొందరు నాయకుల్ని కూటమి ప్రభుత్వం ముద్దాయిలుగా చేసింది అని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నేరం జరిగిన తర్వాత 60 –70 రోజులు దాటాక సాక్షిని విచారిస్తే చెల్లదు.. అని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ దాన్ని ఉల్లంఘించి వారందరినీ నిందితుల్ని చేశారు అని వైసీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**గుంటూరు జైల్లో మాజీ ఎంపీ నందిగం సురేశ్**

వైసీపీ కీలక నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు కోర్టు రిమాండ్ విధించింది. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎంపీ నందిగం సురేశ్ నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు నందిగం సురేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. ఈ నేపథ్యంలో కోర్టు నందిగం సురేశ్‌కు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను విజయవాడ జైలుకు తరలించారు.

**రెండు రోజులుగా అజ్ఞాతంలోనే...**

మాజీ ఎంపీ నందిగం సురేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నందిగం సురేష్ను అరెస్టు చేసేందుకు తుళ్లూరు మండలం ఉద్ధండరాయునిపాలెంలోని ఆయన నివాసానికి వెళ్లినట్లు తెలుస్తోంది. తుళ్లూరు సీఐ వెంకటేశ్వర్లు, మరో 15 మంది సిబ్బందితో మాజీ ఎంపీ సురేశ్ నివాసానికి చేరుకున్నారు. అయితే మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఇంట్లో లేరు. కనీసం ఫోన్ కూడా స్విచ్చాఫ్ అని వస్తోంది. దీంతో పోలీసులు 15 నిమిషాలపాటు వేచి చూశారు. అయినప్పటికీ నందిగం సురేశ్ రాకపోవడంతో అక్కడ నుంచి వెనుదిరిగార. మాజీ ఎంపీ నందిగం సురేశ్ అజ్ఞాతంకు సంబంధించి కుటుంబ సభ్యులకు కూడా తెలియదని పోలీసుల దర్యాప్తులో తేలింది. రెండు రోజుల నుంచి మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఇంటి పరిసర ప్రాంతాలలో కనిపించలేదు అని పోలీసుల విచారణలో తేలింది. ఏది ఏమైనప్పటికీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ కోసం పోలీసులు తీవ్రంగా గాలించారు. అయితే మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఆచూకీ కోసం గాలింపు చేపట్టిన పోలీసులు చివరకు బుధవారం అర్ధరాత్రి హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నందిగం సురేశ్‌ను గుంటూరుకు తరలించారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టారు. విచారణ అనంతరం కోర్టులో హాజరుపరిచారు. దీంతో కోర్టు మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు 14 రోజులపాటు రిమాండ్ విధించింది.

**బెయిల్ పిటిషన్ల డిస్మిస్**

ఇకపోతే మాజీ ఎంపీ నందిగం సురేశ్‌తోపాటు వైసీపీ నేతలకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మాజీ ఎంపీ నందిగం సురేశ్, దేవినేని అవినాశ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి,వైసీపీ నేతలు జీ రమేశ్, షేక్ రబ్బానీ బాషా, చిన్నాబత్తిన వినోద్‌కుమార్‌లు తాము సుప్రీంకోర్టుకు వెళ్లే వరకు 2 వారాలు పాటు తమకు అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఆదేశాలివ్వాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# విజయవాడ బస్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్ల మధ్య ఘర్షణ



విజయవాడ: విజయవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఇద్దరు డ్రైవర్ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఫ్లాట్‌ఫాంపైకి బస్సులను చేర్చే విషయమై వివాదం చెలరేగింది. ఇది ఇద్దరి మధ్య గొడవకు దారి తీసింది. బస్సులో ఉన్న డ్రైవర్‌పైకి మరో డ్రైవర్ దూసుకొచ్చాడు. జమ్మలమడుగు డిపో డ్రైవర్‌పై కల్యాణదుర్గం డిపో డ్రైవర్ దాడి చేశాడు. అసభ్య పదజాలంతో దూషిస్తూ కాలితో తన్నాడు. దాడి సమయంలో బస్సు ఇంజిన్ ఆన్‌లో ఉండటంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. వారిని విడిపించేందుకు ప్రయత్నించారు. ఈ నెల 6న ఘటన చోటుచేసుకోగా.. ఇద్దరు డ్రైవర్లు అధికారులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టారు. బాధ్యులపై చర్యలకు సిద్ధమవుతున్నారు.

# భారీగా తగ్గుతున్న బంగారం ధరలు.. తులం ధర ఎంతో తెలిస్తే..



అమరావతి : దేశంలో బంగారం ధరలు దిగి వస్తూనే ఉన్నాయి. సాధారణంగా బంగారం ధరలలో ప్రతి రోజు పెరుగుదల ఉంటుండగా, ఇటీవల నుంచి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ఇప్పటి వరకు కూడా ధరలు తగ్గుముఖం పడుతూనే ఉన్నాయి. అయితే తాజాగా సెప్టెంబర్ 10వ తేదీన బంగారం, వెండి ధరలు దిగి వచ్చాయి. దేశీయంగా తులం బంగారంపై వంద రూపాయలు తగ్గింది. ప్రస్తుతం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,790 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.72,860 వద్ద కొనసాగుతోంది. ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు. అయితే ఇటీవల బంగారం ధరలు ఆకాశాన్ని తాగేలా ఉండగా, కేంద్ర బడ్జెట్ తర్వాత ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. రోజురోజుకు ధరలు దిగి వస్తూనే ఉన్నాయి. అయితే బడ్జెట్ తర్వాత భారీగా తగ్గిన బంగారం ధరలు.. స్వల్పంగా తగ్గుతూ వచ్చాయి. అప్పటి నంచి ఇప్పటి వరకు బంగారం, వెండి ధరల్లో భారీగానే తగ్గుదల కనిపిస్తోంది.

**చెన్నై:**22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,790
24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72,860
**ముంబై:**22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,790
24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72,860
**ఢిల్లీ:**22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,940
24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.73,001
**హైదరాబాద్:**22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,790
24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72,860
**విజయవాడ:**22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,790
24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72,860
**కోల్‌కతా:**22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,790
24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72,860
**బెంగళూరు:**22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,790
24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72,860
**కేరళ:**22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,790
24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72,860
**పుణే:** 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,790
24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.72,860

ఇక బంగారం ధరలు తగ్గుముఖం పడితే వెండి ధర మాత్రం స్వల్పంగా పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.85,100 వద్ద ఉంది.

# ప్రాణం కన్నా ఆస్తి మిన్న.. ఆస్తి కోసం మూడురోజులు శవ జాగరణ...



హైదరాబాద్ : మనిషి ప్రాణం కంటే ఆస్తే మిన్న అన్నట్లు వ్యవహరించారు. ప్రాణం పోయినా సరే, ఆస్తి కోసం సకాలంలో అంతిమ సంస్కారం నిర్వహించ కుండా అడ్డుకున్నారు. మూడు రోజులు అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుకున్నారు. ఈ విషాదకర ఘటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం విలోచవరం గ్రామానికి చెందిన సునీల్ అనారోగ్యంతో మూడు రోజుల క్రితం హైదరాబాద్ లో మృతి చెందారు. మృతునికి భార్య సంధ్య మూడేళ్ళ కుమారుడు ఉన్నారు. హైదరాబాద్ లో నివాసం ఉండే సునీల్.. భార్యభర్తల మధ్య గొడవలతో ఏడాది కాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసైన సునీల్ మూడు రోజుల క్రితం హైదరాబాదులో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సునీల్ తల్లి ,సోదరుడు వారి కుటుంబ సభ్యులు హైదరాబాద్ కు శవాన్ని తీసుకుని స్వగ్రామానికి బయలుదేరారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన పట్టించుకోని భార్య, భర్త మృతి చెందాడని చెప్పినా ముందుగా స్పందించ లేదని సునీల్ బంధువులు ఆరోపిస్తున్నారు.

**భర్త మృతిపై పోలీసులను ఆశ్రయించిన భార్య**

సునీల్ మృతదేహంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి బయలుదేరి సిద్దిపేట వరకు చేరుకున్నాక, అతని భార్య సంధ్య అల్వాల్ పోలీసులను ఆశ్రయించారు. తన భర్త మృతిపై అనుమానం ఉందని అత్త తోపాటు బావపై ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు సంధ్య బావకు ఫోన్ చేసి శవాన్ని వెంటనే వెనక్కి తీసుకురావాలని ఆదేశించారు. పోలీసుల ఆదేశంతో శవాన్ని తీసుకుని అల్వాల్ పోలీస్ స్టేషన్ కు వెళ్ళగా ఉస్మానియా హాస్పిటల్ కు తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతదేహం గురించి పట్టించుకోకుండా సునీల భార్య సంధ్య తన కొడుకుకు న్యాయం చేయాలని పట్టుబట్టింది. స్వగ్రామానికి వెళ్లాక మాట్లాడుకుందామని సర్ది చెప్పి అందరు మంథనికి చేరారు.

**రోడ్డుపై శవజాగరణ....**

గణేష్ నవరాత్రుల సందర్భంగా శవాన్ని గ్రామంలోకి తీసుకురాకుండా నేరుగా మంథని సమీపంలోని గోదావరినది ఒడ్డుకు తరలించారు. నది ఒడ్డున స్మశానంలో శవ జాగరణ చేశారు. పెళ్ళి అయినప్పటి నుంచి తనకు ఇబ్బంది పెట్టారని ప్రస్తుతం ఆయన లేడని...ఇప్పుడు తన పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఆస్తి విషయం తేల్చే వరకు అంతిమసంస్కారం జరగనివ్వనని భీష్మించారు. తన కొడుకుకు న్యాయం జరిగే వరకు శవాన్ని కదలనివ్వనని ఆందోళనకు దిగారు. ఎవరు చెప్పినా వినకుండా అంతిమ సమస్కారం జరగకుండా అడ్డుకోవడంతో మూడు రోజులు శవ జాగరణ చేశారు.

**భర్త వద్దు..ఆస్తి కావాలా?**

బతికి ఉన్నప్పుడు భర్త బాగోగులను పట్టించుకోలేని భార్య, ప్రస్తుతం ఆయన చనిపోయాక ఆస్తి కోసం అంతిమ సంస్కారం జరగకుండా అడ్డుకోవడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఎంతమంది వచ్చి నచ్చచెప్పిన వినకుండా సంధ్య ఆస్తి కోసం పట్టుబట్టడంతో చివరకు కుటుంబ సభ్యులు కొడుకుకు న్యాయం చేస్తామని గ్రామపెద్దలు హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. కనీసం అంతిమ సంస్కారం పూర్తయ్యే వరకు ఉండకుండా, కొడుకుతో తలకొరివి పెట్టనివ్వకుండా శవాన్ని వదిలేసి హైదరాబాద్ కు వెళ్ళిపోయారు. ఆస్తి కోసం మూడు రోజులు హంగామా చేసిన భార్య చివరు భర్త అంతిమ సంస్కారం పూర్తయ్యేవరకు కూడా ఉండకుండా వెళ్ళిపోవడంతో గ్రామస్తులు పలు రకాలుగా విమర్శించారు. మనిషి ప్రాణం కన్నా ఆస్తే ముఖ్యమా అని ప్రశ్నిస్తూ... ఆమె తీరును తప్పుబట్టారు. ఇలాంటి పరిస్థితి పగవాడికి కూడా రావద్దని అభిప్రాయ పడ్డారు.

# ప్రభుత్వం సంచలన నిర్ణయం..! ఇక సెల్లార్లకు గుడ్ బై..?




హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నగరంలో చేపట్టనున్న నిర్మాణాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకునే దిశగా కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే నగరంలో సెల్లార్ల నిర్మాణాన్ని నిలిపివేయాలని భావిస్తున్నారు. బహుళ అంతస్తుల వాహనాల పార్కింగ్ కోసం సెల్లార్ల నిర్మాణాన్ని నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. సెల్లార్లపై ఫిర్యాదులు, వర్షపునీటి వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీ వర్షాలు కురిసినా సెల్లార్లలో నిలిచిన నీటిని మోటార్లతో తోడుకోవాల్సి వస్తోంది. సెల్లార్ల కోసం చాలా లోతుగా తవ్వడం వల్ల వచ్చే మట్టి కూడా సమస్యగా మారింది. ఇది ఇళ్ల నిర్మాణ వ్యయం పెరగడానికి కారణమవుతోంది. ప్రస్తుతం, బహుళ అంతస్తుల నిర్మాణాలలో ఐదు లేదా ఆరు సెల్లార్లకు అనుమతి ఉన్న విషయం తెలిసిందే.. గతంలో హైదరాబాద్‌లో భూకంప ప్రభావిత ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. అక్కడ సెల్లార్ల నిర్మాణం చాలా ప్రమాదకరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో అసలు సెల్లార్లకే.. అనుమతి ఇవ్వకుంటే వీటన్నింటికీ పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. భవనాల్లో పార్కింగ్ చేసేందుకు సెల్లార్ల స్థానంలో స్టిల్ట్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు డిజైన్‌లో మార్పులు చేస్తున్నారు. ఎన్ని అంతస్తుల స్టిల్ట్ నిర్మాణాలకైనా అనుమతి ఇవ్వవచ్చని వివరించారు. ఈ సందర్భంగా నిర్మాణ ఎత్తులో వెసులుబాటు కల్పించాలని నిర్ణయించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ తరహా నిర్మాణాలకు అనుమతిచ్చినట్లు ఓ టౌన్ ప్లానింగ్ అధికారి తెలిపారు. 2 నుంచి 3 స్టిల్ట్‌లకు అనుమతి ఉందని, ఇళ్లు నిర్మించే వారు సానుకూలంగా ఉన్నప్పటికీ వాణిజ్య భవనాలు నిర్మించేవారు వీటిపై ఆసక్తి చూపడం లేదని అధికారులు చెబుతున్నారు. కమర్షియల్ నిర్మాణాలలో గ్రౌండ్ ఫ్లోర్‌కు చాలా డిమాండ్ ఉంది. ఆ స్థలంలో పార్కింగ్ సౌకర్యం కల్పిస్తే నష్టమేనన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మరోవైపు చట్టంలో సవరణలు చేయడం ద్వారానే దీని అమలు సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు.

రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# లోన్ యాప్ వేధింపులకు వ్యక్తి మృతి.. అశ్లీల వీడియోలుతో..




అమరావతి : వారం రోజుల క్రితం జీడిమెట్ల కు చెందిన విద్యార్థి బానుప్రకాష్ లోన్ యాప్ వేధింపులు భరించలేక ఫాక్స్ సాగర్ లేక్ లో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మరవకముందే మరో ఘటన మేడ్చల్ జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నందిగామ కు చెందిన .వినోద్ భార్య మంజుషాదేవి ఇద్దరు పిల్లలతో కలసి సుచిత్ర సమీపంలోని శ్రీరాం నగర్ లో నివాసముంటున్న బోయిన్ పల్లి లో ఓ ప్రయివేట్ కంపెనీ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తండ్రి అనారోగ్యంతో లోన్ యాప్ లో తన భార్య ఫోటో పెట్టి రూ.2514 తీసుకున్నాడు. ఆ డబ్బుల కూడా కట్టేశాడు. అయితే లోన్ యాప్ నిర్వాహకులు వినోద్ ఇంకా డబ్బులు కట్టాలని వేధించడం మొదలు పెట్టారు. లేదంటే ఫోటోలు కుటుంబ సభ్యులకు పంపుతామని బెదిరించారు. రోజూ ఫోన్ చేసి వేధించడంతో వినోద్ తన భార్యకు తెలియకుండా రెండు లక్షల పైగా చెల్లించాడు. అయినా లోన్ యాప్ వేధింపులు తగ్గలేదు.దీంతో విసుగు చెందిన వినోద్ ఇక నాదగ్గర లేవని ఇప్పటికే లోన్ చెల్లించడానికి అప్పుల పాలయ్యాయని తెలిపాడు. చెల్లించక పోతే ఫోటోలను బంధువులకు, స్నేహితులకు పంపుతామని లోన్ యాప్ నిర్వాహలకు బ్లాక్ మెయిల్ చేశారు. వినోద్ డబ్బుల కోసం బయట ప్రయత్నించినా ఎక్కడా కుదరలేదని.. ఇదే విషయాన్ని లోన్ యాప్ వారికి తెలిపిన పట్టించుకోలేదు. చివరకు లోన్ ఆప్ నిర్వాహకులు అన్నంతపని చేశారు.. వినోద్ ఫోటోలను మార్ఫింగ్ చేసి నగ్న వీడియోలను , పోటోలను కుటుంబ సభ్యులకు పంపారు. దీంతో మనస్తాపం చెందిన వినోద్ ఆత్మహత్య పాల్పడ్డాడు. ఆదివారం రోజున బార్యపిల్లలు కార్మిక నగర్ లో ఉన్న సోదరుని ఇంటికి పంపి నేను కూడ వస్తాను అంటూ చెప్పి పంపాడు. ఎవరు ఇంట్లో లేని సమయం లో వినోద్ ఆత్మహత్య పాల్పడ్డాడు. నిన్న సాయంత్రం ఇంటికి వచ్చి చూసిన భార్య పోలీసులకు సమాచారం ఇచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ.. లేని రోగాన్ని అంటగట్టి లక్షల్లో బిల్లులు..



మేడ్చల్ : మేడ్చల్ పట్టణానికి చెందిన వెంకటేష్ భార్య స్వాతి అనారోగ్యానికి గురయ్యారు. స్థానికంగా ఉన్న లీలా ఆసుపత్రికి వైద్యం కోసం తీసుకువెళ్లారు.పేషెంట్ కండిషన్ సీరియస్ గా ఉందని ఐసీయూలో చేర్పించారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం స్వాతికి ముందుగా క్యాన్సర్ ఉందని భయపెట్టారు. ఆ తర్వాత టీబీ ఉందని నిర్ధారించి, క్షయ వ్యాధిని నయం చేస్తామని రూ. 70 వేలు వసూలు చేశారు. అయినా రోగం నయం కాకపోవడంతో మేడ్చల్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి స్వాతిని తీసుకువెళ్లగా, లీలా ఆసుపత్రి రిపోర్టులనే పరిగణనలోకి తీసుకుని టీబీ కోసం మందులు రాసిచ్చారు. ఆ మందులు వాడిన రెండు, మూడు రోజులకే స్వాతికి రియాక్షన్ అయ్యింది.చర్మం ఊడిపోవడం.. ముఖం పై పొక్కులు రావడంతో స్వాతి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో ఆమెను నిమ్స్ తో సహా పలు ఆసుపత్రులకు తీసుకువెళ్లిన వైద్యం చేసిందుకు నిరాకరించారు. కుటుంబ సభ్యులు వ్యయప్రయాసాలకోర్చి సంప్రద అనే ప్రైవేట్ ఆసుపత్రిలో రూ. లక్షలు వెచ్చించి, రియాక్షన్ వల్ల క్షీణించిన అనారోగ్యం నుంచి స్వాతి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఇలా మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆసుపత్రులు కాసుల కక్కుర్తితో రోగుల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. వైద్యసేవల పేరుతో అందిన కాడికి దోచుకుంటున్నారు. లేని రోగాన్ని ఉన్నట్లు నమ్మిస్తున్నారు. రోగి కండిషన్ చెప్పకుండా లక్షల రూపాయాలు తీసుకుంటూ.. చివరి నిమిషంలో హడావిడి చేసి మరో ఆసుపత్రికి రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నాయి.జిల్లాలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల దందాకు అడ్డు లేకుండా పోతుంది. ఆసుపత్రిలో చేరిన రోగి నుంచి ఎంత వీలైతే అంత దోచేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. చిన్నపాటి సమస్యతో వెళ్లినా అనేక పరీక్షలు చేసి రోగుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నారు. పొరపాటున ఆరోగ్యం ఇబ్బందిగా ఉండి ఆసుపత్రిలో చేరాల్సి వస్తే. పరిస్థితి మరింత దారుణం. రూ. లక్షలు వసూలు చేస్తున్నారు. ఇటీవల ఈ తరహా ఉదంతాలు జిల్లాలో భారీగా వెలుగు చూస్తున్నాయి. రోజుల తరబడి వైద్యం చేయడం, రూ. లక్షలు వసూలు చేయడం, చివరి నిమిషంలో అత్యవసర వైద్యం పేరుతో మరో ఆసుపత్రికి తరలించి చేతులు దులుపుకోవడం ప్రైవేటు ఆసుపత్రులకు పరిపాటిగా మారింది. ఈ ఆసుపత్రులతో జరుగుతున్న వ్యవహారాలను నిత్యం పర్యవేక్షించాల్సిన వైద్యారోగ్య శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ఆసుపత్రి యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నాయి.

**ఠాగూర్ సినిమాను మరిపించేలా..**

కొన్నాళ్ల కిందట వచ్చిన ఠాగూర్ సినిమా గుర్తుంది కాదా.. ఆ సినిమాలో చనిపోయిన వ్యక్తికి ఓ కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు చికిత్స చేస్తారు. రోగికి అత్యవసరంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు సీన్ క్రియేట్ చేసి, చివరకు ఎంత ప్రయత్నించినా ప్రాణం కాపాడలేకపోయమంటూ సమధానమిస్తారు. అయితే అక్కడ హిరో బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాడు. మేడ్చల్ పట్టణంలో లీలా ఆసుపత్రిలో ఈ తరహా సీన్ జరిగింది. చిన్నపాటి అవస్థతో వైద్యం కోసం వచ్చిన స్వాతిని కండిషన్ సీరియస్ గా ఉందని ఐసీయూలో చేర్పించారు. ఒకసారి క్యాన్సర్ ఉందని భయభ్రాంతులకు గురి చేశారు. ఆ తర్వాత క్యాన్సర్ కాదని టీబీ ఉందని భయపెట్టి వైద్యం పేరిట రూ. 70 వేలకు పైగా దండుకున్నారు. తీరా మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో టీబీ సెంటర్ కు వెళ్తితే మందులిస్తారని చెప్పారు. టీబీ సెంటర్ కు వెళ్లిగా అక్కడ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో సూపర్వైజర్ జైహింద్ రెడ్డి తెమడ (టీబీ కోసం)పరీక్షల కోసం చాంపిల్స్ తీసుకున్నాడు. రోగ నిర్ధారణ పరీక్షల నివేదిక రాకుండానే జహింద్ రెడ్డి అప్పటికే లీలా ఆసుపత్రి వైద్యులు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం టీబీ వ్యాధి కోసం మందులు ఇచ్చాడు. ఆ మందులను వాడడంతో స్వాతికి రియాక్షన్ అయ్యింది. వారం రోజుల తర్వాత ఆరోగ్యం క్షీణించి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో మరోసారి లీలా ఆసుపత్రికి వెళ్లగా, తమ వల్ల కాదంటూ చేతులేత్తేశారు.దీంతో తన భార్య ప్రాణాలను రక్షించుకునేందుకు నిమ్స్, ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లినా వైద్యానికి ఆమె కండిషన్ సీరియస్ ఉందని వైద్యానికి నిరాకరించాయి. దీంతో ఎట్టకేలకు సంప్రద ఆసుపత్రిలో చేరి రూ.2 లక్షలకుపైగా వైద్యం కోసం వెచ్చించి స్వాతి ప్రాణాలను రక్షించుకున్నారు. ఆ తర్వాత సెకండ్ ఒపినియన్ కోసం పలు ఆసుపత్రులకు వెళ్లి టీబీ పరీక్షలు నిర్వహించగా, టీబీ లేదని తేలింది. దీంతో మోసపోయానని గ్రహించిన స్వాతి సోమవారం కలెక్టరేట్ లోని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ స్వామిని కలిసింది. తనకు జరిగిన అన్యాయం గురించి వివరించింది. తాను తీసుకున్న ట్రీట్ మెంట్ తో పాటు తాజా వైద్య పరీక్షల రిపోర్టులను డీఎంహెచ్ఓకు చూపించింది. అయితే పరిశీలించిన రఘునాథ స్వామి ఆసుపత్రిలో ట్రీట్ మెంట్ తీసుకున్నప్పుడే తనను సంప్రదించి ఉంటే న్యాయం చేసే వారమని, ఇప్పుడు మోసం చేసిన లీలా ఆసుపత్రి నుంచి డబ్బులు ఇప్పించడం కష్టమని చెప్పారని బాధితురాలు స్వాతి వాపోయారు.

**న్యాయం చేయండి..స్వాతి**

తనకు లేని రోగాన్ని అంటగట్టి రూ. లక్షలు నష్ట పరిచిన ఆసుపత్రులు, వైద్యులు, సిబ్బంది పై కఠిన చర్యలు తీసుకోవాలి. తనను శారీరంగా, మానసికంగా ఇబ్బంది పెట్టి తన కుటుంబాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయేలా చేసిన ఆసుపత్రి యాజమాన్యం నుంచి తనకు నష్ట పరిహారం ఇప్పించాలి. పేద ప్రజల మెరుగైన వైద్యం కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఆసుపత్రులలో ఇచ్చి మందులే రియాక్షన్ అయినందున సమగ్ర విచారణ జరిపించి, బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలి.

# బీఆర్ఎస్‌కు స్పీకర్ రివర్స్ షాక్



హైదరాబాద్: బీఆర్ఎస్ కే అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ రివర్స్ షాకిచ్చారు. ఫిరాయింపు ఎంఎల్ఏల అనర్హతపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని సోమవారం హైకోర్టు అసెంబ్లీ సెక్రటేరియట్ ను ఆదేశించిన విషయం తెలిసిందే.ఉదయం హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో బీఆర్ఎస్ నేతలంతా పిచ్చ హ్యాపీగా ఉన్నారు. ముగ్గురు ఫిరాయింపు ఎంఎల్ఏల దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావుపై అనర్హత వేటు పడినట్లే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీష్ తదితరులు రెచ్చిపోతున్నారు. ఫిరాయింపులను తప్పుపడుతు హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టంటు ఏదేదో మాట్లాడేస్తున్నారు. నిజానికి కోర్టు ఫిరాయింపు ఎంఎల్ఏలపై ఎలాంటి తీర్పివ్వలేదు. ఫిరాయింపులపై నాలుగువారాల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోమని స్పీకర్ కార్యాలయానికి సూచన మాత్రమే చేసింది.ఫిరాయింపులపై గతంలో కూడా ఇలాంటి ఆదేశాలే ఇచ్చిన విషయం గుర్తుండే ఉంటుంది. అప్పట్లో బీఆర్ఎస్ కూడా ఫిరాయింపులపై కోర్టు ఇచ్చిన ఆదేశాలు, సూచనలను ఏమాత్రం పట్టించుకోలేదు. ఇపుడు విషయం ఏమిటంటే ఫిరాయింపులపై ఉదయం హైకోర్టు అలా సూచనలు చేసిందో లేదో సాయంత్రానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఒక ఫిరాయింపు ఎంఎల్ఏకి అసెంబ్లీ తరపున నియమించిన కమిటీలో కీలకమైన పదవి అప్పగించారు. అసెంబ్లీ తరపున మూడు కమిటీలను స్పీకర్ నియమించారు. ఇందులో పబ్లిక్ ఎకౌంట్స్ కమిటి, ఎస్టిమేట్స్ కమిటి, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటిలను స్పీకర్ నియమించారు. వీటిల్లో పబ్లిక్ ఎకౌంట్స్ కమిటి అన్నది చాలా కీలకమైనది. ఎందుకింత కీలకమంటే ప్రభుత్వం చేసే ప్రతి రూపాయి ఖర్చును ఈ కమిటి క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఈ కమిటి ఏ శాఖను పరిశీలించినా ఆ శాఖ ఉన్నతాధికారులు కమిటి అడిగిన లెక్కలను పూర్తిగా ఇవ్వాల్సిందే. ఇంతటి కీలకమైన కమిటీకి అధ్యక్షుడిగా ప్రధాన ప్రతిపక్షంకు చెందిన ఎంఎల్ఏల ఉంటారు. ప్రతిపక్ష ఎంఎల్ఏ ఛైర్మన్ గా ఉంటారు కాబట్టే ఈ కమిటీకి ఇంతటి ప్రాధాన్యత. అయితే తాజా నియామకంలో స్పీకర్ ఛైర్మన్ పదవిని ప్రధాన ప్రతిపక్షానికే కట్టబెట్టారు. అయితే ప్రతిపక్షం ఎంఎల్ఏకి కాకుండా బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి ఫిరాయించిన ఆరెకపూడి గాంధీ నియమించారు. అంటే సాంకేతికంగా గాంధీ బీఆర్ఎస్ ఎంఎల్ఏనే అయినా ఉంటున్నది మాత్రం కాంగ్రెస్ లోనే. పార్టీవర్గాల సమాచారం ఏమిటంటే పబ్లిక్ ఎకౌంట్స్ కమిటి ఛైర్మన్ గా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాజీమంత్రి, సీనియర్ నేత హరీష్ రావు పేరును సూచించినట్లు తెలిసింది.అయితే స్పీకర్ మాత్రం కేసీఆర్ సూచించిన హరీష్ ను కాదని బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి ఫిరాయించిన గాంధిని ఛైర్మన్ గా నియమించటం ద్వారా బీఆర్ఎస్ కు పెద్ద షాకిచ్చారనే అనుకోవాలి. ముగ్గురు ఫిరాయింపు ఎంఎల్ఏలపై ఏదో నిర్ణయం తీసుకోమని ఉదయం హైకోర్టు చెబితే సాయంత్రానికి మరో ఫిరాయింపు ఎంఎల్ఏకి స్పీకర్ కీలకమైన పదవిని అప్పగించటంతో అందరు ఆశ్చర్యపోయారు. తాజా నియామకంతో హైకోర్టు సూచనను స్పీకర్ ఏమాత్రం పట్టించుకోలేదని అర్ధమవుతోంది. దీంతో బీఆర్ఎస్ ఎలా స్పందిస్తుంది, దానికి స్పీకర్ కార్యాలయం ఎలా ప్రతిస్పందిస్తుందనేది ఆసక్తిగా మారింది.

# విశాఖకు మరో వందే భారత్ ట్రైన్ - టైమింగ్స్, షెడ్యూల్ వివరాలు ఇవే



అమరావతి : వందేభారత్ రైళ్లకు దేశవ్యాప్తంగా ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ప్రయాణికులు వందేభారత్ రైళ్ల పట్ల ఆసక్తి ప్రదర్శిస్తుండటంతో ఈ రైళ్ల సంఖ్యను మరింత పెంచే దిశగా కేంద్రరైల్వేశాఖ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.కొత్తగా మరిన్ని రూట్లలో వందే భారత్ రైళ్లను నడిపే దిశగా కేంద్ర రైల్వే శాఖ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా మరో వందే భారత్ రైలును విశాఖకు నడిపేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నం–సికింద్రాబాద్–విశాఖపట్నం, సికింద్రాబాద్–విశాఖపట్నం–సికింద్రాబాద్‌కు రెండు వందే భారత్ రైళ్లు రాకపోకలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

**దుర్గ్–విశాఖపట్నం–దుర్గ్‌కు వందే భారత్ రైలు**

విశాఖకు రెండు వందే భారత్ రైళ్లు నడుపుతున్న సంగతి తెలిసిందే. మూడో వందేభారత్ రైలు దుర్గ్–విశాఖపట్నం–దుర్గ్ మధ్య నడిపేందుకు ఒడిశా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. దుర్గ్–విశాఖపట్నం–దుర్గ్ వందే భారత్ రాకపోకలు త్వరలో ప్రారంభించబోతున్నట్లు తెలుస్తోంది. దుర్గ్–విశాఖపట్నం(20829) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 6 గంటలకు దుర్గ్‌లో బయల్దేరి మధ్యాహ్నం 1.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నంలో విశాఖపట్నం–దుర్గ్(20830) వందే భారత్ మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి రాత్రి 10.50 గంటలకు దుర్గ్ చేరుకుంటుందని తెలుస్తోంది.

**బెంగళూరు కోసం ఏపీ ప్రయాణికుల ఎదురుచూపులు**

ఇకపోతే ఆంధ్రప్రదేశ్ నుంచి బెంగళూరుకు వందేభారత్ రైలు కోసం ఏపీ ప్రజలు ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇందుకు కేంద్ర రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసినట్లు తెలుస్తోంది. విజయవాడ – బెంగళూరు మధ్య వందేభారత్ రైలు నడిపేందుకు అభ్యంతరం లేదని.. ఈ ప్రతిపాదనను పరిశీలిస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి వెల్లడిచడంతో ఏపీ ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**విజయవాడ–బెంగళూరుకు లైన్ క్లియర్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి త్వరలో మరో వందేభారత్ అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. లోక్ సభలో ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ పలు ప్రశ్నలు సంధించారు. అనకాపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధితోపాటు పలు అంశాలపై చర్చించారు. అదే సమయంలో విజయవాడ –ముంబాయి మధ్య వందే భారత్ రైలు నడపాలని కోరారు. అయితే విజయవాడ–ముంబై మధ్య దూరం ఎక్కువ కావడంతో ఆ రెండు స్టేషన్ల మధ్య పగటి పూట వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభించడం అసాధ్యం అని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ కుమార్ వెల్లడించారు. కానీ బెంగళూరు – విజయవాడ మధ్య వందేభారత్ ప్రారంభించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కాచిగూడ నుంచి యశ్వంత్ పూర్ కు వందేభారత్ అందుబాటులో ఉంది. విజయవాడ నుంచి ప్రస్తుతం చెన్నైకు ప్రతీ రోజు వందేభారత్ నడుపుతుంది రైల్వేశాఖ. అయితే బెంగళూరు వరకు నడిపే ప్రతిపాదనను పరిశీలిస్తామని ఏపీ ఎంపీలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

**తెలుగు రాష్ట్రాల్లో వందేభారత్‌కు డిమాండ్**

తెలుగు రాష్ట్రాలలో వందే భారత్ రైళ్లకు మంచి డిమాండ్ ఉంది. రాను రాను ఈ రైళ్లలో ప్రయాణించేందుకు పాసింజర్స్ ఉత్సాహం చూపిస్తున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ – విశాఖ, సికింద్రాబాద్ – తిరుపతి మధ్య నడిచే వందేభారత్ రైళ్లకు డిమాండ్ విపరీతంగా ఉంది. రోజు రోజుకు ఈ డిమాండ్ మరింత పెరుగుతోంది. అలాగే విజయవాడ – చెన్నై మధ్య నడుస్తున్న వందేభారత్‌కు సైతం ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలోనే విజయవాడ – బెంగళూరు మధ్య కొత్తగా వందేభారత్ ప్రతిపాదన తెర మీదకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే త్వరలో ప్రారంభం కానున్న వందేభారత్ స్లీపర్ రైళ్లలోనూ తొలి ప్రాధాన్యతలో సికింద్రాబాద్ – పూణే మధ్య ప్రారంభించాలని రైల్వే శాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే.

# ఈ ప్రయాణికులకు రైల్వే పెద్ద గిఫ్ట్.. త్వరలో ఈ సదుపాయం!



అమరావతి : దేశవ్యాప్తంగా ఉన్న సీనియర్ సిటిజన్‌లకు శుభవార్త రాబోతోంది! ఎందుకంటే పెద్ద సంఖ్యలో సీనియర్ సిటిజన్లు రైలులో ప్రయాణించడానికి ఇష్టపడతారు. కరోనా కాలంలో రైల్వేలు ఇచ్చే సీనియర్ సిటిజన్ రాయితీని ప్రభుత్వం నిలిపివేసింది.దీంతో ఈ సదుపాయాన్ని మళ్లీ తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇది జరిగితే, దేశవ్యాప్తంగా కోట్లాది మంది సీనియర్ సిటిజన్లకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. రైల్వేలో సీనియర్ సిటిజన్లకు ఇచ్చిన ఈ ముఖ్యమైన టికెట్ రాయితీని ప్రభుత్వం 4 సంవత్సరాల పాటు పునఃప్రారంభించవచ్చు. ప్రభుత్వం ఈ ప్రకటన చేస్తే, ప్రధాని మోదీ హయాంలో సీనియర్ సిటిజన్‌లకు ఇదే అతిపెద్ద బహుమతి అవుతుంది.ఇటీవల రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ మాట్లాడుతూ, కరోనా కాలం తరువాత రైలులో సీనియర్ సిటిజన్ల ప్రయాణం పెరిగింది. దిగువ సభలో ఒక ప్రశ్నకు రాత పూర్వక సమాధానం ఇస్తూ, రైల్వే మంత్రి 20 మార్చి 2020 నుండి 31 మార్చి 2021 వరకు 1.87 కోట్ల మంది సీనియర్ సిటిజన్లు రైలులో ప్రయాణించారని చెప్పారు.కానీ 1 ఏప్రిల్ 2021 నుండి ఫిబ్రవరి 2022 వరకు 4.74 కోట్ల మంది సీనియర్ సిటిజన్లు రైలులో ప్రయాణించారు. అప్పుడు ప్రభుత్వం రైల్వే ఛార్జీలలో రాయితీని నిరాకరించింది. అయితే ఇప్పుడు మళ్లీ ప్రారంభించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

**నాలుగేళ్ల తర్వాత..**

దేశంలోని సీనియర్ సిటిజన్లకు 4 సంవత్సరాల తర్వాత రైలు ప్రయాణ ఛార్జీలలో రాయితీని ఇవ్వడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఏసీ కోచ్‌కు బదులుగా స్లీపర్‌పై మాత్రమే ఈ తగ్గింపు ప్రారంభమవుతుందని అంచనా. ఆర్థికంగా స్లీపర్ క్లాస్‌లో ప్రయాణించలేని సీనియర్ సిటిజన్‌లకు మాత్రమే తగ్గింపు లభిస్తుంది. సీనియర్ సిటిజన్లు రిజర్వేషన్ ఫారమ్‌లో డిస్కౌంట్ ఎంచుకోవాలి.

# ఈ 'డైవర్స్' చాలా స్పెషల్.. దుబాయ్ యువరాణి పోస్టు వైరల్




న్యూఢిల్లీ : విడాకుల ప్రకటనతో అందరి దృష్టిని ఆకర్షించిన దుబాయ్ యువరాణి . తాజాగా మరో పోస్టు చేశారు. సొంత బ్రాండ్ కింద పెర్ఫ్యూమ్‌ను ఆవిష్కరించారు.దానికి ఆమె పెట్టిన పేరు నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఇంతకీ విషయం ఏంటంటే..?తాను 'డైవర్స్' పేరిట ఒక కొత్త పెర్ఫ్యూమ్‌ను తీసుకొస్తున్నట్లు యువరాణి షేక్ మహ్రా ఇన్‌స్టాగ్రాం వేదికగా ప్రకటించారు. సొంత బ్రాండ్ 'మహ్రా ఎమ్1' కింద దానిని త్వరలో మార్కెట్‌లోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఆ దృశ్యాలను షేర్ చేశారు. అయితే పెర్ఫ్యూమ్ విలువ ఎంతో తెలియాల్సి ఉంది. ఇదిలాఉంటే.. ఆమె కొన్ని నెలల క్రితమే తన భర్త నుంచి విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.దుబాయ్ పాలకుడు, యూఏఈ ప్రధానమంత్రి షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ కుమార్తె షేక్ మహ్రా. బ్రిటన్‌లో ఉన్నతవిద్యను అభ్యసించిన ఆమె అంతర్జాతీయ వ్యవహారాల్లో పట్టా పొందారు. మహిళా సాధికారికతకు కృషి చేస్తున్నారు. దుబాయ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త షేక్ మనాబిన్ మొహమ్మద్ అల్ మక్తూమ్‌తో మే 27, 2023న వీరి వివాహం జరిగింది.ఏడాది తర్వాత.. తన జీవితంలో అత్యంత విలువైన జ్ఞాపకమని పేర్కొంటూ భర్త, చిన్నారితో కూడిన ఫొటోలను మహ్రా సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ తర్వాత కొన్ని రోజుల్లోనే 'మనమిద్దరం మాత్రమే' అంటూ చిన్నారితో కూడిన మరో ఫొటోతో పోస్టు పెట్టడం చర్చనీయాంశమైంది. అనంతరం జులైలో విడాకుల ప్రకటన చేసి ఆశ్చర్యపర్చారు. ""ప్రియమైన భర్తకు.. మీరు ఇతరుల సహచర్యం కోరుకున్నందున మీతో విడాకులు తీసుకోవాలని నిశ్చయించుకున్నా. 'ఐ డైవర్స్ యూ'. టేక్ కేర్.. మీ మాజీ భార్య" అని అప్పుడు సోషల్ మీడియాలో వెల్లడించారు.

# భారత్‌ను ప్రతిసారీ అనుమానించాల్సిన అవసరం లేదు: కండొలిజా రైస్




న్యూఢిల్లీ :భారత్‌ను ప్రతిసారి అనుమానించాల్సిన అవసరం లేదని అమెరికా మాజీ విదేశాంగ మంత్రి కండొలిజా రైస్ అభిప్రా యపడ్డారు. ప్రధాని మోదీ రష్యా పర్యటనపై ఆమె స్పందిస్తూ.ప్రతీ ఐదు నిమిషాలకోసారి ఆ దేశానికి అమెరికా విశ్వాసపరీక్ష పెట్టాల్సిన పని లేదన్నారు. ఆమె ఇండస్ ఎక్స్ (ఇండియా–అమెరికా డిఫెన్స్ యాక్సలరేషన్ ఎకోసిస్టమ్) సదస్సులో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల బంధం బలపడుతోందని.. రెండువైపుల నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.శ్వేతసౌధంలోకి ఎవరు అడు గుపెట్టినా భారత్‌తో బంధం తమ దేశానికి చాలా కీలకమని గుర్తిస్తారని రైస్ వెల్లడించారు. భారత్ చెబుతున్నట్లు చాలా దేశాలు వ్యూహాత్మక స్వేచ్ఛ (స్ట్రాటజిక్ అటానమీ)ని కోరుకుంటాయన్నారు. దాంతో తమకు ఎటువంటి ఇబ్బందిలేదని పేర్కొన్నారు. ఇరు దేశాల కీలక ప్రయోజనాలే భాగస్వామ్యాన్ని నడిపిస్తాయని అన్నారు.రష్యా ఆయుధాలు పూర్తిగా చెత్తని రైస్ అభివర్ణించారు. తాజాగా మోదీ మాస్కో పర్యటనలో రక్షణ సామగ్రి అంశం పెద్దగా చర్చకు రాలేదని పేర్కొన్నారు. మరోవైపు భారత్‌తో రక్షణ సహకారం పెంపొందించుకోవడంలో అమెరికా నిదానంగా వ్యవహరిస్తోందని.. దీంతో కొన్ని అవకాశాలను వాషింగ్టన్ కోల్పోయినట్లు ఆమె పేర్కొన్నారు.చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య ఉన్న బలమైన బంధం గురించి ప్రధాని మోదీకి తెలుసని రైస్ గుర్తు చేశారు. ఆ బంధం భారత్‌కు పెద్దతలనొప్పిగా మారే అవకాశం ఉందన్నారు. వాషింగ్టన్‌కు బీజింగ్ బలీయమైన ప్రత్యర్థి అని ఆమె వెల్లడించారు. రష్యా కేవలం సైనికపరంగానే శక్తిమంతమైంది. కానీ, టెక్నాలజీ, ఆర్థికంగా మధ్యస్తంగా ఉంటుందని పేర్కొన్నారు. అదే సమయంలో డ్రాగన్ మాత్రం టెక్నాలజీలో దూకుడుగా ఉందని.. అదే సమయంలో ప్రపంచ నెట్‌వర్క్, పంపిణీ వ్యవస్థల్లో విడదీయ లేనివిధంగా కలిసిపోవడంతో దానిని ఎదుర్కోవడం కష్టమన్నారు. భారత్–అమెరికా మధ్య పౌర అణుఒప్పందం జరగడంలో నాటి విదేశాంగ మంత్రి రైస్ కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆమె స్టాన్‌ఫోర్డ్‌లోని హూవర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా ఉన్నారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# హైదరాబాద్ వాసులకు అలర్ట్.. ఈ నెల 10 నుంచి 16 మధ్య ఈ రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు..

హైదరాబాద్ : హైదరాబాద్ నగరవాసులకు ట్రాఫిక్ అధికారులు అలర్ట్ జారీ చేశారు. నగరంలోని పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్లు అధికారులు తెలిపారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణ రోజుల్లోనే పరిస్థితి ఇలా ఉంటే.. పండుగలు, ఉత్సవాలప్పుడు ఇక పరిస్థితి చెప్పక్కర్లేదు. వినాయక చవితి వంటి పండుగలు వస్తే మాత్రం అధిక రద్దీతో ట్రాఫిక్ సమస్యలు ఇంకా ఎక్కువవుతాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కారు కీలక ప్రకటన చేసింది. ఈ నెల 10వ తేది నుంచి అంటే నేటి నుంచి 16వ తేది మధ్య జరిగే గణేష్ విగ్రహ నిమజ్జన ఊరేగింపుల దృష్ట్యా, నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగరంలో పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నం 3 గంటల నుండి అర్ధరాత్రి వరకు పలు రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్లు తెలిపారు.

**పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు..**

ఈ ట్రాఫిక్ ఆంక్షల్లో భాగంగా కర్బలా మైదాన్ నుంచి వచ్చే వాహనాలను అప్పర్ ట్యాంక్‌బండ్ వైపు అనుమతించబోమని అధికారులు తెలిపారు. సెయిలింగ్ క్లబ్ నుంచి కవాడిగూడ క్రాస్ రోడ్ల వైపు ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. ఇక, పంజాగుట్ట, రాజ్‌భవన్ నుంచి వెళ్లే వారు ఎన్టీఆర్ మార్గ్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. పీవీఎన్‌ఆర్ మార్గ్ వైపు వెళ్లే వాహనాలను ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా కాకుండా షాదన్ కాలేజీ, లక్డీ–కా–పుల్ వైపు మళ్లించనున్నారు.

ఈ మార్గాలతో పాటు అంబేద్కర్ విగ్రహం నుంచి వెళ్లే వాహనాదారులను ఎన్టీఆర్ మార్గ్ వైపు అనుమతించబోమని, ఇక్బాల్ మినార్ వైపు మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇక్బాల్ మినార్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనాలు కట్ట మైసమ్మ దేవాలయం, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ వైపు మళ్లించనున్నారు. అలాగే, కట్ట మైసమ్మ దేవాలయం నుండి ట్రాఫిక్‌ను చిల్డ్రన్స్ పార్క్ వైపు అనుమతి ంచరు. డీబీఆర్ మిల్స్, కవాడిగూడ వైపు మళ్లిస్తారు. ముషీరాబాద్, జబ్బార్ కాంప్లెక్స్ నుండి వెళ్లే వాహనాలు సెయిలింగ్ క్లబ్ వైపు అనుమతించబోమని అధికారులు తెలిపారు. ఆ వాహనాలన్నింటిని డీబీఆర్ మిల్స్ వైపు మళ్లించనున్నారు. ఇక, మినిస్టర్స్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు పీవీఎన్‌ఆర్ మార్గ్ వైపు, నల్లగుట్ట బ్రిడ్జి వద్ద కర్బలా వైపు మళ్లించనున్నారు. బుద్ధ భవన్ నుంచి వచ్చే వాహనాలను పీవీఎన్‌ఆర్ మార్గ్ వైపు అనుమతించకుండా, నల్లగుట్ట బ్రిడ్జి వద్ద మినిస్టర్ రోడ్డు వైపు మళ్లించనున్నట్లు అధికారులు తెలిపారు.

# గాజాపై యుద్ధ విమానాలతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్



గాజా: దక్షిణ గాజాగాపై ఇజ్రాయెల్ ట్యాంకులు, యుద్ధ విమానాలతో విరుచుకుపడుతుంది. దక్షిణ గాజా స్ట్రిప్‌లోని ప్రధాన ప్రాంతాల్లో ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు చేస్తోంది. తాజాగా జరిపిన దాడిలో 40 మంది పౌరులు మరణించినట్లు గాజా అధికారులు తెలిపారు. దక్షిణ గాజా స్ట్రిప్‌మీద ఇజ్రాయెల్ సైన్యం ఉపరితల, వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. ఈ దాడుల్లో దక్షిణ గాజా స్ట్రిప్‌లోని ఖాన్ యునిస్,అల్ మవాసీ ప్రాంతాల మీద చేసిన దాడుల్లో గత 24 గంటల్లో 40మంది మరణించారని, మరో 60 మంది తీవ్రంగా గాయపడినట్లు గాజా సివిల్ డిఫెన్స్ అధికారి మహ్మద్ అల్ ముఘైర్ మీడియా సంస్థ ఏఎఫ్‌పీకి చెప్పారు. సివిల్ డిఫెన్స్ ప్రతినిధి మహమూద్ బసల్ మాట్లాడుతూ..స్థానిక శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు దాడులకు ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదని, ఫలితంగా సామాన్యులు ప్రాణాలు కోల్పోవడంతో పాటు సహాయక చర్యలకు మరింత ఇబ్బందులు తలెత్తుతున్నట్లు చెప్పారు. గాజాపై దాడిని ఇజ్రాయెల్ సైన్యం అధికారంగా స్పందించింది. తాము ఖాన్ యునిస్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో పనిచేస్తున్న హమాస్ ఉగ్రవాదులపై యుద్ధవిమానాలతో దాడి చేసినట్లు వెల్లడించింది. గాజా స్ట్రిప్‌లోని ఉగ్రవాద సంస్థలు ఇజ్రాయెల్ ప్రాంతాలు, సైన్యానికి వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని, ఫలితంగా ఈ దాడులు చేస్తున్నట్లు వెల్లడించింది.

# పార్కింగ్ వద్దే లగేజీ అప్పగింత.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కొత్త సదుపాయం



హైదరాబాద్: శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులకు 'సిటీ సైడ్ చెక్–ఇన్ అండ్ బ్యాగేజ్ డ్రాప్ ఫెసిలిటీ' పేరిట కొత్త సదుపాయాన్ని ఎయిరిండియా అందుబాటులోకి తెచ్చింది. ఎయిరిండియా, విస్తారా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు ఈ సదుపాయం లభిస్తుంది. ప్రయాణికులు తమ బ్యాగేజీని 'డిపార్చర్ లెవల్' వరకు తీసుకువెళ్లే అవసరం లేకుండా, వాహనాల పార్కింగ్ – బస్టాండుకు సమీపంలో, గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న కౌంటర్‌లోనే అప్పగించే అవకాశం కల్పిస్తున్నట్లు ఎయిర్ ఇండియా వెల్లడించింది. విమానం బయలుదేరడానికి 6 గంటల ముందు నుంచి, 90 నిమిషాల ముందు వరకు ఇక్కడ ప్రయాణికుల చెక్ ఇన్ బ్యాగులు తీసుకుంటారు. బ్యాగులు కిందే ఇచ్చేయడం వల్ల ప్రయాణికులకు చెక్–ఇన్ ప్రక్రియ సులువవుతుందని, సమయం ఆదా అవుతుందని పేర్కొంది. ఇటీవల హైదరాబాద్ విమానాశ్రయంలో సెల్ఫ్ బ్యాగ్ డ్రాప్ (ఎస్‌బీడీ) మెషీన్లను ఎయిరిండియా ఏర్పాటు చేసింది. దీనివల్ల బ్యాగేజీ అప్పగింత సమయం కూడా ఆదా అవుతుంది.

# వినేష్ ఫొగట్‌కు టఫ్ ఫైట్



న్యూఢిల్లీ : పారిస్ ఒలింపిక్స్ 2024లో అనర్హత వేటుకు గురైన భారత మహిళా రెజ్లర్ వినేష్ ఫొగట్.. సంచలనాలకు తెర తీశారు. రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. రెజ్లింగ్ రింగ్ నుంచి ఎన్నికల బరిలో దిగారు. సహచర రెజ్లర్ బజరంగ్ పునియాతో కలిసి రాజకీయాల్లో అరంగేట్రం చేశారు. కాంగ్రెస్ పార్టీ తీర్థాన్ని పుచ్చుకొన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో జులానా నియోజకవర్గం నుంచి పోటీలో నిలిచారు. కాంగ్రెస్.. ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న స్థానం ఇది. 2005 తరువాత ఇప్పటివరకు ఒక్కసారి కూడా గెలవలేదు. 2009, 2014 ఎన్నికల్లో ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ ఇక్కడ ఘన విజయం సాధించింది. ఆ పార్టీ తరఫున పర్మిందర్ సింగ్ ధుల్.. గెలిచారు. ప్రస్తుతం ఈ పార్టీ బీజేపీతో పొత్తులో ఉంది. 2019 నాటి ఎన్నికల్లో జులానా నియోజకవర్గంలో జన్‌నాయక్ జనతా పార్టీ పాగా వేసింది. ఆ పార్టీ తరఫున అమర్‌జీత్ ధండా ఇక్కడ విజయం సాధించారు. ఈ పార్టీ కూడా బీజేపీతో పొత్తులో కొనసాగుతోంది. ఈ కారణంతోనే ఇక్కడ అభ్యర్థిని నిలపలేదు బీజేపీ. పొత్తులో భాగంగా జేజేపీకే వదిలివేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే అమర్‌జీత్‌కే టికెట్ ఇచ్చింది జేజేపీ. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ గెలుపు ముఖం చూడని నియోజకవర్గం జులానా నుంచి ఆ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగారు వినేష్ ఫొగట్. ఈ ఉదయం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, తన అభిమానులతో కలిసి హోమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినేష్ ఫొగట్ విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రజలు, స్థానికుల అండదండలతో ఇన్ని రోజులూ రెజ్లింగ్‌లో చిరస్మరణీయమైన విజయాలను సాధించానని, ఇప్పుడు హర్యానా ఎన్నికల్లో కూడా వాళ్ల ఆశీర్వాద బలంతో గెలుస్తానని అన్నారు. దేవుడి దయ, పెద్దల ఆశీర్వాద బలం లేకపోతే ఏమీ సాధించలేమని వ్యాఖ్యానించారు. ఇప్పుడు కూడా ప్రజల ఆశీర్వాదం బలంతో ఎన్నికల్లో ముందడుగు వేస్తాననే విశ్వాసం తనకు ఉందని వినేష్ ఫొగట్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ఎప్పటిలాగే తనకు మద్దతు ఇస్తారని నమ్ముతున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలిచి ప్రజలకు సేవ చేస్తానని స్పష్టం చేశారు.

# పాఠశాలలో విద్యార్థిని కాటేసిన పాము. పాము విషాన్ని నోటితో లాగేసిన ఉపాధ్యాయుడు



భీంపూర్: ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థిని పాము కాటేసిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా దనోర మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివారల ప్రకారం. మామిడి యశ్వంత్ అనే విద్యార్థి దనోర పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. సోమవారం వరండాలో కూర్చున్న యశ్వంత్ ను పాము కాటేయడంతో వెంటనే ఉపాధ్యాయుడు గుమ్మడి సురేశ్‌కు సదరు విద్యార్థి తెలిపాడు. కాటేసిన భాగాన్ని సురేశ్ నోటితో విషాన్ని లాగాడు అనంతరం తన బైక్‌పై బాలుడిని తీసుకొని భీంపూర్ ఆరోగ్య కేంద్రానికి వెళ్లాడు. అక్కడి వైద్యుడు లేకపోవడంతో అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చాడు. అంబులెన్స్ రాకపోవడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వెంటనే వైద్యులు చికిత్స అందించడంతో బాలుడికి ప్రాణాపాయం తప్పింది. విద్యార్థిని వెంటనే రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాటేసిన పాము విషపుదా?కాదా? అనే తెలుసుకునేందుకు సమయం పడుతుందని వైద్యులు పేర్కొన్నారు. రక్త పరీక్ష చేసి ల్యాబ్‌కు పంపామని వైద్యులు వివరించారు. చికిత్స అందించకపోవడంతోపై భీంపూర్ ఆరోగ్య కేంద్రం వైద్యుడిని నిఖిల్ రాజ్ సంప్రదించగా వివరణ ఇచ్చాడు. గిరిగామ్ ఉపకేంద్రం సందర్శనలో ఉన్నానని, అంబులెన్స్ మరో చోటకు వెళ్లిందని తెలియజేశారు.

# అదానీకి గట్టి ఎదురుదెబ్బ..!




అమరావతి : భారత కుబేరుల్లో ఒకరు అదానీ. వ్యాపార రంగంలో ఆయన్ను ఢీకొట్టేందుకు హేమాహేమీలే తలపడుతుంటారు. అంబానీతో పోటీ పడి నికర ఆస్తుల్లో ఆయనే టాప్ ప్లేస్ సంపాదించడం ఈ మధ్యే జరిగింది. అదానీ తన వ్యాపార సామ్రాజ్యాన్ని ఇతర దేశాలకు కూడా విస్తరించారు. ఈ క్రమంలోనే అదానీకి ఎదురుదెబ్బ తగిలింది. ఇంతకీ ఆయనకు షాక్ ఎవరిచ్చారు, ఎందుకిచ్చారు..?గౌతం అదానీ.. ఆసియా ఖండంలో ఉన్న అత్యంత సంపన్నుల్లో ఈయన ఒకరు. దేశ విదేశాల్లో తన వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అయితే హిండెన్‌బర్గ్ నివేదికతో ఒక్కసారిగా ఆయనపై ప్రపంచ దేశాలు దృష్టి సారించాయి. తాజాగా అదానీకి కెన్యా కోర్టు షాకిచ్చింది. కెన్యాలోని జోమో కెన్యాట్ట అంతర్జాతీయ విమానాశ్రయంను తాను నిర్వహించాలని గౌతం అదానీ భావించారు. అయితే కెన్యా హైకోర్టు తీర్పుతో అదానీ ఆశలకు బ్రేకులు పడ్డాయి. ఈ విమానాశ్రయాన్ని టేకోవర్ చేసి తాను నిర్వహించాలన్న యోచనకు తాత్కాలికంగా బ్రేక్ వేస్తూ కెన్యా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జోమో కెన్యాట్ట అంతర్జాతీయ విమానాశ్రయంను టేకోవర్ చేయాలన్న ప్రతిపాదన వచ్చినప్పటి నుంచే అక్కడి స్థానిక కార్మికులు, ఉద్యోగులు ఇతర ఏవియేషన్ సంఘాలు నిరసన తెలిపాయి. విమానాశ్రయం నిర్వహణ ప్రస్తుత యాజమాన్యం నుంచి అదానీ గ్రూప్‌కు బదిలీ చేయడాన్ని ప్రస్తుతానికి నిలిపివేయాలంటూ కెన్యా హైకోర్టు పేర్కొంది. జోమో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 30 ఏళ్లపాటు లీజుకు తీసుకుని దాని నిర్వహణన చేపట్టాలన్న ఆలోచనకు అడ్డుకట్ట వేసినట్లయ్యింది. జోమో కెన్యాట్ట అంతర్జాతీయ విమానాశ్రయం తూర్పు ఆఫ్రికాలోనే అతిపెద్ద ఏవియేషన్ హబ్‌గా గుర్తింపు పొందింది. జూలై నెలలో కార్మికులు, సిబ్బంది అదానీకి వ్యతిరేకంగా నిరసనలు తారాస్థాయికి చేరడంతో దీన్ని విచారణ చేసిన కెన్యా హైకోర్టు ఈ తీర్పు వెలువరించింది. అదానీ సంస్థ ఈ విమానాశ్రయం నిర్వహణ తీసుకుంటే స్థానికంగా ఉద్యోగాలు కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ విదేశీయులు ప్రముఖంగా భారతీయులకు ఇక్కడ ఉద్యోగాలు వస్తాయని కార్మికులు ,సిబ్బంది తెలిపారు. గత నెలలో ప్రధాన ఏవియేషన్ సంఘం ఏకంగా స్ట్రైక్‌కు పిలుపునిచ్చింది. అదానీ చేతుల్లోకి విమానాశ్రయం నిర్వహణ వెళితే కెన్యా దేశస్థులకు ఉద్యోగాలుండవని ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజుల పాటు స్ట్రైక్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో అక్కడి ప్రభుత్వంతో చర్చలు జరిపి వెంటనే విమానాశ్రయం నిర్వహణకు సంబంధించిన ఒప్పందాన్ని రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. అయితే ఏర్పోర్టును అదానీ సంస్థకు అమ్మబోవడం లేదని ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం దీనిపై తీసుకోలేదని దీనిపై ముందుకెళ్లాలా లేదా అనేది ఇంకా ఆలోచిస్తున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఆగలేకపోయారు.. మద్యం సీసాలు ఎత్తుకెళ్లిన మందుబాబులు



అమరావతి :ఏపీలో మద్యం బాబులు కొందరు ఆగలేకపోయారు. పోలీసులు ధ్వంసం చేసేందుకు సిద్దంగా ఉంచిన మద్యం సీసాలను ఒక్కొకరుగా వచ్చి తీసుకెళ్లిపోయారు. అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నం చేసినా ఆగలేదు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలీసులు భారీ ఎత్తున మద్యం సీసాలను సీజ్ చేశారు. దాదాపు రూ.50 లక్షల విలువైన 24,031 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. అయితే.. సోమవారం వాటిని ధ్వంసం చేసేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నల్లచెరువులోని డంపింగ్ యార్డులో మద్యం సీసాలను ధ్వంసం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సాధారణంగా రోడ్డురోలర్‌తో సీసాలను ధ్వంసం చేస్తుంటారు. అలాంటిది ఈసారి పొక్లెయిన్ తీసుకురావడంతో సీసాలను పగలగొట్టడానికి సమయం పట్టింది. దీన్ని అవకాశంగా తీసుకున్న మందుబాబులు ఒక్కసారిగా గుంపులుగా అక్కడికి చేరుకున్నారు. మద్యం సీసాలను నేలపై పెట్టిన తర్వాత కాసేపటికే గుంపులుగా వచ్చి చేతికందిన మద్యం సీసాలను పట్టుకుని పారిపోయారు. కొందరిని పోలీసులు వద్దు ఆ సీసాలను అక్కడే పెట్టాలని చెప్పినా వినలేదు. మద్యం సీసాలను ధ్వంసం చేస్తారా.. ప్రాణం పోతున్నంత పనైందంటూ సీసాలను పట్టుకెళ్లారు. ఆగలేకపోయాం సార్ అంటూ పలువురు చెప్పుకొచ్చారు. ఆ తర్వాత మిగిలిన వాటిని పోలీసులు ప్రొక్లెయిన్‌తో ధ్వంసం చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుత సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

# భద్రాచలం వద్ద మరోసారి విజృంభిస్తున్న గోదావరి..



అమరావతి : భద్రాద్రి కొత్తగూడెం వద్ద గోదావరికి మరోసారి వరద పోటెత్తింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో సోమవారం నుంచి నీటిమట్టం పెరుగుతూ వస్తున్న గోదావరి మొదటి ప్రమాద హెచ్చరికను మించి ప్రస్తుతం 45 అడుగుల మేర ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం 45 అడుగులు దాటిన నేపథ్యంలో అధికారులు తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు అధికారులు. మరో మూడు అడుగులు పెరిగి 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక కూడా వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద 9 లక్షల 46 వేల 412 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరికి వరద పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కాగా..భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారాయి. ఈ నేపథ్యంలో అధికారులు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో గోదావరి వరద మరింత పెరుగుతోంది. ఇంద్రావతి, ప్రాణహిత నదుల నుంచి గోదావరిలోకి లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టుకు ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా పెద్ద ఎత్తున వరద నీరు వస్తుండటంతో అధికారులు నిన్నటి నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు గోదావరిలోకి వదులుతున్నారు.

**తెలంగాణ చతిస్గడ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి..**

ఎగువన కురిసిన భారీ వర్షాలకు ములుగు జిల్లా వాజేడు మండలం పేరూర్ వద్ద గోదావరి క్రమంగా పెరుగుతుంతి. వెంకటాపురం వాజేడు మండలాల్లోని గోదావరి పరివాహక లోతట్టు ప్రాంతాలు పంట పొలాలు జలమయమయ్యాయి. గోదారి ఎగువపోటుతో తెలంగాణ రాష్ట్ర సరిహద్దు టేకులగూడెం వద్ద రేగుమాగు వాగు ఉప్పొంగుతుంది.

# బుడమేరు ఎఫెక్ట్: బెజవాడ రియల్ ఎస్టేట్ గల్లంతు?



అమరావతి : విజయవాడ అంటే.. వాణిజ్య కేంద్రం. విజయవాడ అంటే.. అన్ని రకాల వ్యాపారాలకు కేంద్రం. దీంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం గతం కొన్నాళ్లుగా పుంజుకుంటోంది. ముఖ్యంగా నగరంలో పరిస్థితి ఎలా ఉన్నా.. నున్న మార్గంలో ఏర్పాటు చేసిన హైదరాబాద్–గన్నవరం ఫ్లైఓవర్.. హైదరాబాద్– ఏలూరు ఇన్నర్ రోడ్డు కారణంగా.. శివారులో ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా ఉంది. ఎటు చూసినా.. బహుళ అంతస్థులు కనిపిస్తున్నాయి. ఇక, రాజకీయ నాయకులు.. పారిశ్రామిక వేత్తలు కూడా రైతుల నుంచి పొలాలు కొనుగోలు.. ఇన్నర్ రింగ్ రోడ్డు సహా.. రామవరప్పాడు ఫ్లైవోవర్ దిగువన కూడా భారీ ఎత్తున విల్లాలు, అపార్ట్‌మెంటులు నిర్మించారు. నిర్మిస్తున్నారు కూడా. ఇక, సింగ్‌నగర్‌కు సమీపంలో నందమూరి నగర్‌లోనూ విల్లాలు, అపార్ట్‌మెంటులు జోరుగా వెలిశాయి. మొత్తంగా చూస్తే.. రాజధాని అమరావతి కారణంగా విజయవాడ విస్తరణ అయితే పెరిగింది. గన్నవరం ఎయిర్ పోర్టుకు సమీపంలో ఉండడంతో ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద ఫ్లాట్లకు డిమాండ్ పెరిగింది. అపార్ట్‌మెంటు ఫ్లాట్లు 35–40 లక్షల మధ్య ఉన్నవి ఇటీవల సర్కారు మారిన తర్వాత.. ఏకంగా 60 లక్షలకు వెళ్లాయి. ఇక, 1.5 కోట్లు ఉన్న విల్లాలు.. రూ.3 కోట్లకు చేరాయి. ముఖ్యంగా ఉద్యోగులు.. మధ్య తరగతి ప్రజ లు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇదిమంచిదే. తద్వారా నగర విస్తరణ పెరిగి పెరుగుతున్న జనాభాకు ఆవాసం ఏర్పడుతోంది. అయితే.. ఇక్కడే ఇప్పుడు బుడమేరు వరద పొంగింది. నడుములోతు నుంచి నిలువెత్తు వరదలు సంభవించాయి. దీంతో శివారు ప్రాంతం మొత్తం మునిగిపోయింది. ఈ ప్రభావం ఇప్పుడు రియల్ ఎస్టేట్ బిజినెస్‌పై భారీగా పడిందని అంటున్నారు పరిశీలకులు. ఎందుకంటే.. వందల కొద్దీ ఫ్లాట్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పుడు ఇక్కడ బడమేరు ముప్పు ఉందన్న విషయం అందరికీ తెలిసిపోయింది.

రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# Rahul Gandhi's 'Sikh' Remark In US Sparks Massive Row, BJP Sends Him 1984 Reminder

After Congress leader Rahul Gandhi on Tuesday stirred a massive controversy with his remark on the state of religious freedom in India, citing the example of Sikhs, during an event in the US, the BJP slammed the former for setting a dangerous narrative on the foreign soil.Union Minister Hardeep Singh Puri said, "He (Rahul Gandhi) speaks without knowing the facts. There are some sensitive issues which include our unity and diversity which has a dangerous narrative."He reprimanded the Congress leader for remarks on Sikhs in India and claimed that the community was scared of wearing turban and kada during the 1984 riots under the Congress regime."In 1984, 3000 innocent people were killed. They were dragged out of the house. These are all documented facts about this. The only time Sikhs felt anxiety and a sense of insecurity was during Rajiv Gandhi's time (1984)," said the Union Minister.He further added that he travelled across the country with a turban and had never faced or seen issues to what Gandhi referred in the US.Stepping up the offensive against the Congress leader, Puri asserted that his language matches the tone of Khalistan separatist Gurpatwant Singh Pannun, who is wanted in India on terror charges. "Rahul's language is quite similar to the fugitive from our law who lives in New York, Pannun….is he meeting him?"



**What Rahul Gandhi Said On Sikhs?**

Addressing the members of the Indian diaspora in Virginia, Gandhi said that the fight in India is about whether a person, as a Sikh, is going to be allowed to wear a turban in India and would be able to visit a Gurdwara.While interacting with a member of the Indian community, Gandhi further asked his name and then said that the fight was about whether he would be allowed to wear a turban or kada in India."First of all, you have to understand what the fight is about. The fight is not about politics. It is superficial. What is your name? The fight is about whether…he as a Sikh is going to be allowed to wear his turban in India. Or he as a Sikh is going to be allowed to wear a kada in India. Or a Sikh is going to be able to go to Gurdwara. That's what the fight is about and not just for him, for all religions."

**'Will Drag Him to Court'**

BJP leader RP Singh said that he's exploring ways to file a case against Gandhi for making the controversial statement. "I will file a case against him. I will drag him to court," Singh was quoted as saying ."Three thousand Sikhs were massacred in Delhi, their turbans were taken off, their hair was chopped off and beard was shaved…He (Rahul Gandhi) doesn't say that this happened when they (Congress) were in power…I challenge Rahul Gandhi to repeat in India what he is saying about Sikhs," he added.The 1984 anti-Sikh riots erupted following the assassination of then Prime Minister Indira Gandhi by her two Sikh bodyguards. Thousands of Sikhs were killed, with Delhi being the most affected, followed by Kanpur.

**'Defaming India On Foreign Soil'**

Gandhi embarked on his first three-day visit to the US as a leader of the opposition in the Lok Sabha on Sunday. Attending several seminars and community-based meetings, the Congress leader raised several issues related to India including unemployment and the ideological influence of the RSS in the country.BJP was quick to respond to Rahul for his comments on RSS and unemployment, with agriculture minister Shivraj Singh Chouhan saying he was the leader of the opposition and accountable to the country, but "he has been going abroad and spoiling the image of the country, which is a crime akin to treason".

## Tweet Claims CJI Chandrachud's Family Member Linked To Doctor's Lobby In Bengal, Complaint Filed

The Supreme Court Registry on Monday filed a complaint with the Cyber Cell over a malicious tweet linking Chief Justice of India (CJI) D Y Chandrachud's family member to a doctors lobby in West Bengal.The tweet came ahead of the hearing by the three judges bench of Supreme Court headed by CJI in the suo motu case relating to the rape and murder of a doctor in Kolkata's RG Kar Medical College.As per the officials, a malicious tweet had been circulated on X ahead of the Supreme Court hearing on the Kolkata rape and murder case attempting to link a member of the family of the Chief Justice of India with a medical lobby in Bengal."The tweet is ill intended, factually incorrect and an attempt to malign the judiciary," said the Supreme Court registry in its complaint lodged before the Cyber Cell here in Delhi.The West Bengal Police too tweeted about a fake message being spread regarding the same. "It has come to our notice that extremely derogatory and baseless aspersions are being cast by some people in social media about the Hon'ble Supreme Court of India including the Hon'ble Chief Justice of India." "Exploiting freedom of speech to indulge in wild falsehood, that too against the Hon'ble Apex Court, is illegal and punishable. Sternest possible legal action will be initiated against those trying to malign the judiciary," it added.

## Congress leader Shashi Tharoor moves Supreme Court in defamation case

Congress MP Shashi Tharoor on Monday sought an urgent hearing in the Supreme Court on his plea against a Delhi High Court verdict refusing to quash the defamation proceedings against him on a complaint over his alleged "scorpion on Shivling" remarks targeting Prime Minister Narendra Modi.A top court bench headed by Chief Justice D Y Chandrachud, who held the court till 6 pm as against the usual 4 pm, was requested by a lawyer that the plea be heard on Tuesday or else, the Congress leader will have to appear in a Delhi court in connection with the private defamation complaint the same day."Just circulate the email. I will look into it just now," the CJI said.HC refuses to quash defamation proceedings against Shashi Tharoor on 'scorpion on shivling' remarkThe Delhi High Court refused to quash the defamation proceedings against Tharoor on August 29.It had said prima facie, imputations like "scorpion on Shivling" against the prime minister are "despicable and deplorable".The high court had said prima facie, the remarks defamed the prime minister, the ruling Bharatiya Janata Party (BJP) as well as its office-bearers and members.The high court, which had on October 16, 2020 stayed the criminal proceedings against the Congress MP from Thiruvananthapuram in Kerala in the defamation complaint, vacated the interim order and directed the parties to appear before the trial court on Tuesday (September 10).The complaint against Tharoor was filed by Delhi BJP vice-president Rajiv Babbar. The Congress leader had sought setting aside of the trial court's April 27, 2019 order summoning him as an accused in the criminal defamation complaint filed by Babbar as well as the November 2, 2018 complaint.Except for the headline, this story has not been edited by The Telegraph Online staff and has been published from a syndicated feed.

# Rahul Gandhi's 'Made In China' Remark In US Draws Shivraj Chouhan's Ire



Rahul Gandhi In US: Union Minister Shivraj Singh Chouhan on Monday, September 9, attacked Congress leader Rahul Gandhi over his statements made in America.Shivraj Singh Chouhan said that tarnishing the image of the country on foreign soil is an "anti-national act". Addressing the Indian-American community in Dallas on Sunday, September 8, Congress leader Rahul Gandhi said that love, respect and humility are missing from Indian politics. He also said that employment generation was a problem in India as the country had handed manufacturing to China.During an interaction with students at the University of Texas in Dallas, Gandhi also emphasised the need to focus on manufacturing in India and said that India, America, and other countries in the West are facing unemployment problems, while this is not the case in China because it dominates global production.

**'Rahul Gandhi Frustrated By Lok Sabha Elections Defeat'**

Shivraj Singh Chouhan on Monday said, "Rahul Gandhi is the Leader of the Opposition in the Lok Sabha and is accountable to the country. Tarnishing the image of the country abroad is an anti-national act and no patriot engages in such acts." The Union Minister claimed that Rahul Gandhi is frustrated by the Congress's Lok Sabha election defeat and is venting in this manner. Targeting Rahul Gandhi, Chouhan said that the Rashtriya Swayamsevak Sangh has trained lakhs of workers who have dedicated their lives to India.

**'Our politics should be limited to the nation'**

Shivraj said that the politics of Congress, BJP, and other parties should be limited to the nation and everyone should realise that they are representing the country while living abroad. The Union Agriculture Minister said, "When I went to America during Manmohan Singh's tenure as Prime Minister, I was asked if the Indian Prime Minister was inferior. At that time I had replied that the Prime Minister of India can never be inferior."

**'Rahul's Roots Are Not Connected To India'**

Chouhan also slammed Gandhi's alleged comment that everything in India is 'Made in China'. He said that such statements are tantamount to insulting the country's skilled workforce. "This used to happen before when very few things were imported. Even now, very few things are imported to the country as per the need," Chouhan said."India's skilled workers and employees are making many things indigenously, but Rahul Gandhi is insulting them. Rahul's roots are not connected to the soil of India. He has nothing to do with the Indian people, their culture and traditions," the former Madhya Pradesh CM said.While interacting with the students at the University of Texas in Dallas in the USA on Sunday, Rahul Gandhi said: "China is dominating global production." He said products in India like phones and clothes have 'Made In China' written on them. "The West, America, Europe, and India have given up the idea of production and handed it to China. The act of production generates jobs," he said.Union Minister Giriraj Singh, too, slammed Rahul Gandhi for the comment. "Rahul Gandhi is branding for China. During your time, there was more import in defence. Now we are exporting, during your time the export was only of Rs 19 lakh crores and right now the export has been more than Rs 75 lakh crores. This shows that manufacturing is increasing in the country," Giriraj Singh said.

**'People Love Narendra Modi'**

On Rahul Gandhi's comment that no one is afraid of Prime Minister Narendra Modi, Chouhan said that this is actually true. "People love Modiji and that is why they have made him Prime Minister for the third consecutive time. Under PM Modi's leadership, India is becoming self-reliant and will soon become the world's third-largest economy," Chouhan said.




# లండన్ వీధుల్లో రాశీ ఖన్నా దుమారం



టాలీవుడ్ టు బాలీవుడ్ రాశీఖన్నా జర్నీ గురించి తెలిసినదే. ఇక్కడ అడపాదడపా అవకాశాలు అందుకుంటున్న రాశీ ఇటీవల హిందీ చిత్రసీమపైనా గురి పెట్టింది. అక్కడ షాహిద్ లాంటి స్టార్ సరసన నటించింది. పెద్ద తెర, ఓటీటీ రెండు చోట్లా అవకాశాలు అందుకుంటూ కెరీర్ ని బ్యాలెన్స్ చేస్తోంది. మరోవైపు తమిళంలోను ఈ బ్యూటీ నటిస్తోంది.హిందీలో వరుసగా ప్రయోగాలు చేస్తోంది ఈ బ్యూటీ. ప్రస్తుతం ట్వల్త్ ఫెయిల్ నటుడు విక్రాంత్ మాస్సేతో కలిసి మరో ప్రయోగాత్మక చిత్రంలో నటిస్తోంది. ఇది నిజ ఘటనల ఆధారంగా రూపొందుతోంది.గుజరాత్ అల్లర్లు, గోద్రాలో సబర్మతి ట్రెయిన్ దహనం నేపథ్యంలో రూపొందుతున్న ది సబర్మతి రిపోర్ట్ తన కెరీర్ లో పెద్ద మలుపునిస్తుందని రాశీ భావిస్తోంది. గోద్రా సంఘటన, గుజరాత్ అల్లర్ల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. గతంలో IPS ఆఫీసర్ మనోజ్ శర్మగా నటించిన విక్రాంత్ మాస్సే ది సబర్మతి రిపోర్ట్‌లో హిందీ జర్నలిస్ట్‌గా నటిస్తున్నాడు. విక్రాంత్- రాశితో పాటు, జవాన్ నటుడు రిద్ధి డోగ్రా కూడా ఈ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రం 3 మే 2024న భారీ స్క్రీన్ లలో విడుదల కానుంది. షాహిద్ తో యోధ తర్వాత రాశీకి ఇది మరో క్రేజ ఆఫర్.మరోవైపు తెలుగులో తెలుసు కదా, తమిళంలో మేధావి చిత్రాల్లోను రాశీ నటిస్తోంది. టిఎంఇ అనే హిందీ చిత్రంలోను నటిస్తూ బిజీగా ఉంది. ఈ సినిమాలన్నీ రిలీజ్ లకు వచ్చే లోపు రాశీ వరుస ఫోటోషూట్లతో సోషల్ మీడియాల్లో అభిమానులకు టచ్ లో ఉంటోంది. ఈ భామ నిరంతర ఫోటోషూట్లు యువతరంలో గుబులు పుట్టిస్తున్నాయి. ప్రస్తుతం లండన్ ట్రిప్ నుంచి కొన్ని అరుదైన క్లిక్స్ ని షేర్ చేస్తోంది. అక్కడ మిట్ట మధ్యాహ్నం విహారంలో ఉన్నప్పటి ఫోటోగ్రాఫ్ ఒకటి అంతర్జాలంలోకి వచ్చింది. పూర్తిగా ఉలెన్ కోట్ తో కప్పుకుని, రాశీ స్టైలిష్ లుక్ లో కనిపించింది. లండన్ లో చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ఈ భామ స్పెషల్ కేర్ తీసుకుంటోందని అర్థమవుతోంది. లండన్ లో రాశీ రియల్ క్వీన్ ని తలపిస్తోందంటూ అభిమానులు ఈ లుక్ కి కాంప్లిమెంట్లు ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.

# కేతిక శర్మ.. కిల్లర్ లుక్స్‌కి ఫిదా అవ్వాల్సిందే



మొదట మోడలింగ్ లోకి అడుగుపెట్టిన కేతిక శర్మ, తన అందం, స్టైల్, క్యూట్ నెస్ తో యూత్ లో గుర్తింపు తెచ్చుకుంది. కేతిక యూట్యూబర్ గా కెరీర్ ప్రారంభించి, అక్కడ తన పాపులారిటీతో సినిమాల్లో ఛాన్సులు దక్కించుకుంది. తన మొదటి సినిమా రొమాంటిక్ లో ఆకాష్ పూరి సరసన నటించి మంచి ఫేమ్ తెచ్చుకుంది. ఆ సినిమాలో కేతిక తన గ్లామర్, యాక్టింగ్ టాలెంట్ తో ప్రేక్షకుల మనసు దోచుకుంది.తొలి సినిమాతో మంచి పేరును సంపాదించినా, ఆ తర్వాతి ప్రాజెక్టులు లక్ష్య మరియు రంగ రంగ వైభవంగా ఆశించిన విజయాన్ని అందించలేకపోయాయి. అయినప్పటికీ, కేతిక తన క్యూట్ లుక్స్ తో యూత్ లో క్రేజ్ సంపాదించుకుంటూనే ఉంది. ఆమెకి వచ్చిన అవకాశాలు పెద్దగా బ్లాక్ బస్టర్స్ కాకపోవడం వల్ల, టాలీవుడ్ లో తనకి నిరంతరంగా మంచి బ్రేక్ కోసం ఎదురు చూస్తోంది.బ్రో సినిమాతో మళ్ళీ తెరపై కనిపించిన కేతిక, పవన్ కళ్యాణ్, సాయి తేజ్ లతో కలిసి నటించింది. ఈ సినిమా మంచి విజయాన్ని సాధించినప్పటికీ, కేతిక కి మరింత గుర్తింపు రావాల్సిన అవసరం ఉంది. ఇక సోషల్ మీడియా ద్వారా తన క్రేజ్‌ను కాపాడుకుంటూ, అందమైన ఫోటో షూట్స్‌తో తరచూ అభిమానులను ఆకట్టుకుంటోంది.రీసెంట్ గా కేతిక తన స్టైలిష్ లుక్స్ తో అభిమానులకు ఒక రకమైన ఫ్యాషన్ సిగ్నల్ ఇస్తూ ఫోటోలు పంచుకుంటోంది. ఈ ఫోటోలకు ఫ్యాన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండటం, తన అభిమానులతో కంటెక్ట్ లో ఉండటం వల్ల, కేతిక తన క్రేజ్ ను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ చేస్తోంది. ప్రస్తుతం కొన్ని కొత్త ప్రాజెక్ట్స్ కోసం చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆమెకు మంచి కథలు, పాత్రలు వస్తే, త్వరలోనే టాలీవుడ్ లో కేతిక శర్మ టాప్ హీరోయిన్ గా ఎదిగే అవకాశం ఉన్నదని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు.

# స్టార్ డైరెక్టర్ కుమార్తె టాలీవుడ్ డెబ్యూ ఫిక్సైందా!



స్టార్ డైరెక్టర్ శంకర్ కుమార్తె అతిది శంకర్ హీరోయిన్ గా కోలీవుడ్లో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే హీరోయిన్ గా మూడు సినిమాలు చేసింది. మావీరన్ సినిమాతో అమ్మడికి మంచి గుర్తింపు దక్కింది. అందులో శివ కార్తికేయన్ కి జోడీగా నటించింది. ప్రస్తుతం నటిస్తోన్న ఓ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ లో ఉండగా, మరో సినిమా షూటింగ్ దశలో ఉంది. అలాగే అతిథి డాడ్ సినిమాకి ప్రమోట్ అవునట్లు ప్రచారంలో ఉంది. శంకర్ పిలిచి మరీ కుమార్తెకి అవకాశం ఇస్తున్నాడనే వార్తలు కొన్ని రోజులుగా వైరల్ అవుతున్నాయి.శంకర్ తదుపరి వేలప్పన్ నవల ఆధారంగా ఓ సినిమాకి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో హీరో ఎవరు? అన్నది ఇంకా ఫైనల్ కాలేదు. కానీ హీరోయిన్ గామాత్రం ఛాన్స్ కుమార్తెకే ఇవ్వాలని ఫిక్స్ అయ్యారని ఆయన సన్నిహిత వర్గాల నుంచి లీకైంది. సరిగ్గా ఇదే సమయంలో శంకర్ బ్రాండ్ ఇమేజ్ ని ఓ టాలీవుడ్ డైరెక్టర్ ఇన్ క్యాష్ చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. అతిది తెలుగులో ఓ యువ దర్శకుడు అవకాశం ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.వివరాల్లోకి వెళ్తే... దర్శకుడు విజయ్ కనకమేడల దర్శకత్వంలో త్వరలో ఓ సినిమా ప్రారంభం కానుంది. ఇందులో అతిది శంకర్ హీరోయిన్ గా ఎంపిక చేసినట్లు వార్తలొస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెల నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం. అయితే ఇందులో హీరో ఎవరు? అన్నది తెలియదు. అలాగే శంకర్ కుమార్తె తెలుగు చక్కగా మాట్లాడుతుంది. తెలుగు అవకాశాలకు భాష కూడా కలిసొస్తుంది. అయితే ఈ అవకాశంలో నిజమెంతో తెలియాలి.ఇండియన్ గ్రేట్ డైరెక్టర్ శంకర్ . పాన్ ఇండియాలోనే కాదు పాన్ వరల్డ్ లోనే ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. కానీ చాలా సింపుల్ పర్సన్. బాలీవుడ్..కోలీవుడ్..టాలీవుడ్ లో ఆయన కోరితే కుమార్తెకి స్టార్ హీరోల సరసనే అవకాశాలు ఇప్పించగలరు. కానీ ఆ ఛాన్స్ తీసుకోలేదు. ఎవరైనా ప్రతిభతో మాత్రమే రాణించగలరని నమ్మే వ్యక్తి. ఇంకా చెప్పాలంటే అతిదికి శంకర్ కేవలం తండ్రి మాత్రమే. అతడి ద్వారా అతిది నటనలో ప్రత్యేకగా నేర్చుకున్నది అంటూ ఏం లేదు.

# రానా.. రొటీన్‌గా కాకుండా..



రానా దగ్గుబాటి ఓ వైపు హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా, విలన్ గా సినిమాలు చేస్తూ స్టార్ యాక్టర్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. కేవలం హీరోగానే చేస్తానని మడికట్టుకొని కూర్చోకుండా బలమైన క్యారెక్టర్స్ ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం రానా విలన్ గా నటించిన వేట్టయాన్ రిలీజ్ కి రెడీ అవుతోంది. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా జ్ఞాన్ వేల్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. దసరాకి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇదిలా ఉంటే రానా నిర్మాణ భాగస్వామిగా చేసిన 35 చిన్న కథ కాదు తాజాగా ప్రేక్షకుల ముందుకొచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఈ మధ్య కాలంలో వచ్చిన బెస్ట్ కంటెంట్ మూవీస్ లో ఇది ఒకటనే మాట వినిపిస్తోంది. సినిమాకి డీసెంట్ కలెక్షన్స్ వస్తున్నాయి. తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమాకి రోజు రోజుకి ఆదరణ పెరుగుతూ ఉండటంతో మంచి కలెక్షన్స్ వస్తాయని తెలుస్తోంది. గతంలో రానా దగ్గుబాటి కేరాఫ్ కంచరపాలెం అనే సినిమాకి నిర్మాణ భాగస్వామిగా మారి రిలీజ్ చేశారు. అది ఎంత పెద్ద హిట్ అయ్యిందో అందరికి తెలిసిందే. చాలా కాలం నుంచి ప్రొడ్యూసర్ గా కూడా అడుగులు వేయాలని రానా అనుకుంటున్నారు. 35 చిన్న కథ కాదు సినిమా హిట్ కావడంతో ఇప్పుడు నిర్మాతగా మరిన్ని ప్రాజెక్ట్స్ లలో భాగం కావాలని రానా అనుకుంటున్నారు. స్పిరిట్ మీడియా బ్యానర్ తో నిర్మాణ భాగస్వామిగా రానా ప్రయాణం చేయాలని డిసైడ్ అయ్యారు.. 35 చిన్న కథ కాదు తర్వాత ఇప్పుడు దుల్కర్ సల్మాన్ హీరోగా మొదలైన కాంత సినిమాకి రానా నిర్మాణ భాగస్వామిగా మారాడు. దుల్కర్ సల్మాన్ ఈ చిత్రానికి మరో నిర్మాతగా ఉన్నారు. ఇద్దరు కలిసి కాంత చిత్రాన్ని మల్టీ లింగ్వల్ ప్రాజెక్ట్ గా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మరో హీరోగా కూడా రానా దగ్గుబాటి నటిస్తూ ఉండటం విశేషం. ఇదిలా ఉంటే కంటెంట్ బేస్డ్ కథలతో తెరకెక్కే సినిమాలకి నిర్మాణ భాగస్వామిగా చేయాలని రానా అనుకుంటున్నాడంట. ఇకపై రెగ్యులర్ గా స్పిరిట్ మీడియా బ్యానర్ నుంచి మూవీస్ వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. రానా నిర్మాణ భాగస్వామిగా ఉంటే ఆ చిత్రాలకి ప్రమోషన్ కూడా గట్టిగా అవుతుంది. రానా ఐడియాలజీ చాలా డిఫరెంట్ గా ఉంటుంది. క్రియేటివ్, రియలిస్టిక్ ఐడియాలతో తెరకెక్కే కథలకి రానా ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి ప్రమోట్ చేస్తాడు. ఇప్పుడు తన బ్యానర్ లో కూడా అలాంటి కథలనే ప్రొడ్యూస్ చేయాలని అనుకుంటున్నారంట.

# సెకెండ్ ఇన్నింగ్స్‌లో చందమామకి బంపర్ ఆఫర్!



చందమామ కాజల్ అగర్వాల్ వివాహం తర్వాత సెలక్టివ్ గా సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. రొమాంటిక్ పాత్రలకు పూర్తి దూరంగా జరిగింది. మెచ్యూర్డ్ పాత్రల్లో నటించడానికి ఆసక్తి చూపిస్తుంది. దీనిలో భాగంగా లేడీ ఓరియేంటెడ్ చిత్రాల్ని టార్గెట్ గా పెట్టుకుంది. అలాగని హీరోయిన్ పాత్రలకు దూరమైందని కాదు. సినిమలో తన పాత్ర ప్రాధాన్యత.....ఆ పాత్ర విధానాన్ని బట్టి కమిట్ అవుతుంది.కీలక పాత్రలకు సైతం సై అంటోంది. స్టార్ హీరోల చిత్రాల్లో కాసేపు కనిపించినా? ఓ కిక్ అంటూ వాటిని విడిచి పెట్టడం లేదు. ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడు సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తోన్న సికందర్ చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. ఇందులో కాజల్ మరో హీరోయిన్ గా నటిస్తుందా? కీలక పాత్ర పోషిస్తుందా? గెస్ట్ అపిరియన్స్ ఇస్తుందా? అన్నది క్లారిటీ లేదు కానీ ప్రాజెక్ట్ కి మాత్రం కమిట్ అయినట్లు వినిపిస్తుంది.ఇప్పటికే సల్మాన్ ఖాన్ కి జోడీగా రష్మిక మందన్నా ఎంపికైన సంగతి తెలిసిందే. ఇద్దరి మధ్య వయసువ్యత్యాసం ఉన్నా సల్మాన్ తో ఎలాంటి సన్నివేశాలు చేయడానికైనా రెడీ అంటూ దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో కాజల్ పేరు తెరపైకి రావడం ఇంట్రెస్టింగ్. ఇప్పటికే ఈ సినిమా మూడు మేజర్ షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. సల్మాన్ సహా కీలక నటులంతా ఇందులో పాల్గొన్నారు.భారీ యాక్షన్ ఎంటన్ టైనర్ గా మురగదాస్ మలుస్తున్నారు. దర్బార్ తర్వాత మురగదాస్ దర్శకత్వానికి దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. చాలా సమయం తీసుకుని సికందర్ స్టోరీ రాసుకున్నారు. సల్మాన్ భాయ్ ఎంతో ఇష్టపడి చేస్తోన్న చిత్రమిది. సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. తమిళ నటుడు సత్యరాజ్ మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే ప్రతీక్ పాటిల్ బబ్బర్ ప్రధాన ప్రతినాయకుడు. సాజిద్ నడియాడ్‌వాలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం 2025 ఈద్‌కి విడుదల కానుంది.

# బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ.. మా మధ్య స్నేహబంధమే కానీ ద్వేషం లేదు: మిచెల్ మార్ష్




నవంబర్ 22 నుంచి ప్రారంభం కానున్న బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ కోసం భారత్.. ఆస్ట్రేలియా పర్యటనకి వెళ్లనుంది. గత రెండు పర్యటనల్లోనూ టీమ్‌ఇండియానే విజయం సాధించింది.ఈసారి కూడా సిరీస్ గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. భారత్‌ను ఎలాగైనా కట్టడి చేయాలని ఆసీస్ ప్రణాళికలు రచిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆస్ట్రేలియా ఆటగాడు ఉస్మాన్ ఖవాజా మాట్లాడాడు. గత రెండు సార్లు భారత్ చేతిలో ఆస్ట్రేలియా ఓడిపోవడంతో ఇప్పుడు ఈ సిరీస్ ఆసక్తికరంగా మారిందన్నాడు.'భారత క్రికెట్ అభిమానులు ఏ ఫార్మాట్‌లో అయినా ఆస్ట్రేలియా ఓడిపోవాలనే కోరుకుంటారు. టెస్ట్‌ల నుంచి ఐపీఎల్ వరకూ ఈ రెండూ జట్లు పోటాపోటీగా తలపడతాయి. మరీ ముఖ్యంగా గత నాలుగేళ్ల నుంచి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ భారత్ గెలుచుకుంటూ వచ్చింది. గత రెండేళ్ల నుంచి ఈ రెండు జట్లు అంతర్జాతీయ స్థాయిలో టాప్ 2 స్థానాల్లో కొనసాగుతున్నాయి. చాలా ఏళ్లుగా క్రికెట్‌లో భారత్ ఆధిపత్యం చలాయిస్తూ వస్తోంది. ఈ రెండు జట్ల మధ్య పోటీ ఎల్లప్పుడూ తీవ్రంగా ఉంటుంది' అని ఖవాజా పేర్కొన్నాడు.అయితే, ఈ విషయం గురించి ఆసీస్ మరో ఆటగాడు మిచెల్ మార్ష్ కూడా స్పందించాడు. భారత్, ఆసీస్ మధ్య స్నేహ బంధమే కానీ ద్వేషం లేదని స్పష్టం చేశాడు.'ఆస్ట్రేలియా భారత్ మ్యాచ్ అంటే క్రికెట్ అభిమానులకు ఒక ఉత్కంఠ ఏర్పడుతుంది. ఇటీవల కాలంలో ఈ రెండు జట్ల మధ్య పోటీ మరీ తీవ్రంగా మారింది. అలా అని మా మధ్య స్నేహ బంధమే కానీ ద్వేషం లేదు' అని ఆసీస్ టీ20 కెప్టెన్ మిచెల్ మార్ష్ తెలిపాడు. ఆసీస్ ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ కూడా భారత్‌తో తలపడటం కష్టమైన విషయం అని అన్నాడు. 'భారత జట్టు టాప్ ఆర్డర్ చాలా గొప్పది. నా తొలి సిరీస్‌లోనే వారితో ఆడాను. ఆ మ్యాచ్‌లో మేము గెలవడం అదే చివరిసారి కావచ్చు. అయితే అప్పటి ఆటగాళ్లు ఇప్పటికీ జట్టులో ఆడుతున్నారు. ఇప్పటి వరకూ ఒక టెస్ట్ కూడా భారత్ ఓడలేదు. హెడ్, గ్రీన్ వంటి ఆటగాళ్లు ప్రస్తుతం జట్టులో ఉన్నారు కాబట్టి ఈసారి ట్రోఫీని తిరిగి గెలుచుకునే అవకాశం ఉంది' అని అన్నాడు.

# బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్.. తుది జట్టు నుంచి సర్ఫరాజ్ ఖాన్ ఔట్..! స్టార్ బ్యాటర్‌కు ఛాన్స్?




భారత్, బంగ్లాదేశ్ మధ్య సెప్టెంబరు 19 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది. మొదటి టెస్టు కోసం 16మంది సభ్యులతో ఆదివారం భారత జట్టును ప్రకటించారు.రోడ్డు ప్రమాదంలో గాయపడిన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఈ సిరీస్‌తో టెస్టుల్లోకి రీ ఎంట్రీ ఇవ్వనున్నాడు. అతడు 20 నెలల తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడబోతున్నాడు. మరో వికెట్‌కీపర్ కేఎల్ రాహుల్ కూడా ఈ సిరీస్‌కు ఎంపికయ్యాడు. ఈ ఏడాది ఆరంభంలో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో రాణించిన యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ కూడా తన స్థానాన్ని కాపాడుకున్నాడు.దీంతో బంగ్లాదేశ్‌తో సిరీస్‌లో తుది జట్టు కూర్పు ఎలా ఉంటుందనే దానిపై టీమ్‌ఇండియా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు కోసం కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్ మధ్య పోటీ ఉంది. అయితే, రాహుల్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. నవంబర్‌లో ఆస్ట్రేలియా వేదికగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకుని 50 టెస్టులు ఆడిన అనుభవమున్న కేఎల్ రాహుల్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని జట్టు యాజమాన్యం భావిస్తోందట. అంతేకాకుండా జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు కీలక ఇన్నింగ్స్‌లు ఆడిన అనుభవం ఉండటం కూడా రాహుల్‌కు కలిసొచ్చే అంశం."బయటి వ్యక్తులకు ఒక టీమ్ ఎలా పని చేస్తుంది, అక్కడ ఉన్న వ్యవస్థలేంటో తెలియదు. కేఎల్ రాహుల్ తన చివరి మూడు మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికాలో ఒక సెంచరీ చేశాడు. ఇటీవలి కాలంలో అత్యుత్తమ టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లో ఇది ఒకటి. గాయం బారినపడటానికి ముందు హైదరాబాద్‌లో ఆడిన తన చివరి టెస్ట్‌లో 86 పరుగులు చేశాడు. అతడిని జట్టు నుంచి తప్పించలేదు. గాయపడి టీమ్‌లో చోటు కోల్పోయాడు. ప్రస్తుతం అతడు ఫిట్‌గా ఉండటమే కాదు అందుబాటులో కూడా ఉన్నాడు. దులీప్ ట్రోఫీతో రాహుల్‌కు మ్యాచ్ ప్రాక్టీస్ లభించింది. ఇందులో అర్ధ శతకం బాదాడు. అతడు తుది జట్టులో ఉంటాడు. సర్ఫరాజ్ ఖాన్ తనకు వచ్చిన అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. కానీ, టీమ్ మేనేజ్‌మెంట్ బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ కోసమే కాకుండా ఆస్ట్రేలియా పర్యటనను కూడా దృష్టిలో ఉంచుకుని అనుభవజ్ఞుడైన రాహుల్ వైపు మొగ్గు చూపుతోంది. ఎవరైనా గాయపడితే సర్ఫరాజ్‌కు అవకాశం వస్తుంది" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY CHALLA SRIKANTH, PRINTED AT SRINIVASA PRINTERS D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA WEST,(U) VILLAGE, BAPATLA - 522101, GUNTUR DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA -522101 GUNTUR DISTRICT, ANDHRA PRADESH, EDITOR : CHALLA SRIKANTH, RNI : APBIL / 2023 / 86665, CELL: 6281086394 , emil srikanth9550389070@gmail.com